RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 183 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శుక్రవారం 3-7-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠ మాసం, తిథి॥ తదియ ఉ॥9.03, శ్రవణం ఉ॥10.24, వర్జ్యం మ॥2.37 - 4.19, దుర్ముహూర్తం ఉ॥8.09-9.01, శుభ సమయం ఉ॥7.30-9.00, రాహుకాలం ఉ॥10.30-12.00, సూర్యోదయం ఉ॥ 5.31, సూర్యాస్తమయం సా॥ 6.34 గం॥

## నేడు కడప స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం

**కర్నూలు, జులై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. అందులో భాగంగానే ఈ నెల 3వ తేదీన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. కడప స్టీల్ ప్లాంట్‌పై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాయలసీమ బిడ్డ అని పేరు చెప్పుకున్న జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఆ ప్రాంతానికి ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో తెదేపా జెండా ఇంకా 30 ఏళ్లు ఎగురుతూనే ఉంటుందని ఎంపీ అన్నారు. రాష్ట్రంలో కేవలం తెదేపా పాలనలో అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ల పండగ కొనసాగుతుందని అన్నారు.



# ఏపీ నుంచి అమలులోకి వీబీ జీ రామ్ పథకం

- రైల్వే కోడూరు నుంచి పథకం ప్రారంభించిన కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం
- వీబీజీ రామ్ జీతో రాష్ట్రాలకు రూ.7.5 లక్షల కోట్ల కేంద్ర నిధులు
- ప్రతీ గ్రామ పంచాయతీకి ఏడాదికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- వీబీ జీ రామ్ జీ పథకం భారం కాదు బాధ్యతన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద తోతాపురి మామిడి కొనుగోళ్లకు కేంద్ర మంత్రి హామీ
- పీఎం ఆవాస్ యోజన, పీఎం గ్రామీణ్ సడక్ యోజన కింద రూ.422 కోట్ల నిధుల పత్రం అందజేత

**తిరుపతి, జులై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం వీబీ జీ రామ్ జీ ఏపీ నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రక ఘట్టానికి తిరుపతి జిల్లా రైల్వేకోడూరు వేదికైంది. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' పథకాన్ని ఏపీ నుంచి ప్రారంభించారు. దీంతో దేశవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వచ్చింది. ముక్కవారిపల్లి గ్రామంలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనుల్ని ముగ్గురు నేతలూ లాంఛనంగా ప్రారంభించారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం మిగతా 2లో..

## చిన్న పరిశ్రమల అనుసంధానంతో ఏపి వర్క్-స్టడీ మోడల్ దేశానికే ఆదర్శం

### - శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్



**శ్రీసిటీ, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (ఎస్ఐయు)ని శ్రీసిటీలోని తాత్కాలిక క్యాంపస్‌లో రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి, ఐటీ,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైం గవర్నెన్స్ మంత్రి నారాలోకేష్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐయు గ్లోబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు, పాలకమండలి ప్రతినిధులు, పరిశ్రమ భాగస్వాములు పాల్గొన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మంత్రి, అతిధులకు సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మన యువతకు అపారమైన సామర్థ్యం, ఆశయాలు ఉన్నాయని, వారికి అవసరమైనదల్లా ఉపాధి అవకాశాలతో నేరుగా అనుసంధానమైన విద్యావిధానం అన్నారు. ఈ కీలక సవాలుకు పరిష్కారం చూపే ప్రయత్నంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. ఎస్ఐయూ అమలు చేస్తున్నవర్క్-స్టడీ డ్యూయల్ మోడల్ కు శ్రీసిటీలోని బలమైన పారిశ్రామిక ఎకోసిస్టమ్ కీలకంగా నిలుస్తోందన్నారు. 31 దేశాలకు మిగతా 2లో..

## తిరుచ్చి ఉప ఎన్నికపై వీడని ఉత్కంఠ

### పోటీ నుంచి తప్పుకున్న లారెన్స్... నటి త్రిష పోటీ చేస్తారంటూ ప్రచారం



**చెన్నై, జూలై 2 (ఆర్ఎన్ఎ):** కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష పేరు మరోసారి తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆమె త్వరలో రాజకీయాల్లోకి అడుగుపెడతారని ప్రచారం సాగుతోంది. తిరుచ్చి ఉపఎన్నికలో అధికార పార్టీ తరఫున బరిలో నిలుస్తారా? అనే చర్చలు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ ప్రచారానికి ప్రధాన కారణం హీరో, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ తీసుకున్న నిర్ణయమే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి రెండింట్లోనూ విజయం సాధించారు. అనంతరం తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. మొదట ఈ స్థానంలో రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఆయన కూడా రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి చూపినట్లు వార్తలు వచ్చాయి. అయితే చివరి నిమిషంలో ఆయన పోటీ నుంచి తప్పుకోవడంతో ఇప్పుడు తిరుచ్చి అభ్యర్థి ఎవరనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో త్రిష పేరు తెరపైకి వచ్చింది. విజయ్‌కు సన్నిహితురాలిగా పేరున్న త్రిషను రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఆలోచన ఉందా? ఆమె ఉపఎన్నికలో పోటీ చేసే అవకాశం ఉందా? అనే ఊహాగానాలు తమిళ మిగతా 2లో..

## ఏపీకి నేను మేనమామ

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



**తిరుపతి, జులై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సీఎం చంద్రబాబుతో కలిసి వీబీ జీ రామ్ జీ పథకం ప్రారంభించిన అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకే వీబీజీ రామ్ జీ కింద రూ.7.5 లక్షల కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ 9 నెలల కాలానికి ఈ పథకం కింద ఏపీకి కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని అన్నారు. స్వయంగా గ్రామ సభలే పంచాయితీలో పనుల్ని నిర్దేశించుకుంటాయని తెలిపారు. తనను మధ్యప్రదేశ్ లో అంతా మామాజీ అని పిలుస్తారని.. ఇప్పుడు ఏపీకి కూడా తాను మేనమామనే అయ్యానని మంత్రి వ్యాఖ్యానించారు. ఏ మేనమామ ఖాళీ చేతులతో రాడని.. ఏపీకి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్ల నిధులు ఇవ్వనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంలకు ఆయన అందజేశారు. అలాగే 2,16,250 మెట్రిక్ మిగతా 2లో..

## శ్రీవారి సేవలో మంత్రి లోకేశ్



**తిరుమల,జులై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర మిగతా 2లో..

## విద్యార్థులకు ఇంటి పట్టాలు అందజేసిన మంత్రి



**శ్రీకాళహస్తి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నియోజకవర్గ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించి ఇంటి పట్టాలను అందజేశారు. ఊరుందూరులోని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నివాసంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మంత్రి లోకేష్ మాట్లాడారు. పదో తరగతిలో బాబు అగ్రహారం పాఠశాలకు చెందిన సాయి పూజిత, చల్లపాలెం అరుంధతి వాడకు చెందిన మోహిత్ శరన్ సాయి, కుంటిపుడికి చెందిన జస్మిత ఉత్తమ మార్కులు సాధించారు వారికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి రాజీవ్ నగర్ లో 3 సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని మాట ఇచ్చారు. ఈ మేరకు మంత్రి లోకేష్ చేతుల మీదుగా అందజేశారు. మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

### తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద స్వాగతం



**శ్రీనగర్, జూలై 2 (ఆర్ఎన్ఎ):** హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్ లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు, వివిధ సంస్థలు భక్తులకు ఆత్మీయ ఆతిథ్యంతో స్వాగతం పలికాయి. అంతకుముందు, జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ వార్షిక యాత్ర కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. భక్తులను స్వాగతించిన వారిలో డీఐజీ సర్గున్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మిగతా 2లో..

## మైనారిటీ సంక్షేమం, సాధికారత, న్యాయపాలనలో చారిత్రాత్మక పురోగతి


### లా, న్యాయ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి నస్యం మహమ్మద్ ఫరూక్

**అమరావతి, జులై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం "స్వర్ణాంధ్రప్రదేశ్ 2047" లక్ష్య సాధన దిశగా సంక్షేమం, సామాజిక న్యాయం, మైనారిటీల సాధికారత, పారదర్శక న్యాయపాలనకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి నస్యం మహమ్మద్ ఫరూక్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గత రెండేళ్లలో మైనారిటీల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, హజ్ సేవలు, డిజిటల్ పరిపాలన, న్యాయ సంస్కరణలు, కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధి, న్యాయవాదుల సంక్షేమం, ఈ-కోర్టుల విస్తరణ వంటి అన్ని రంగాల్లో ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. 2026-27లో కూడా మైనారిటీల సాధికారత,



సమాన న్యాయం, నాణ్యమైన న్యాయపాలన, మౌలిక వసతుల అభివృద్ధి, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు మరింత ప్రాధాన్యతనిస్తూ, ప్రతి పౌరుడికి న్యాయం, ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, 'స్వర్ణాంధ్రప్రదేశ్ 2047' విజన్ సాధనలో ఇదే దిశగా ముందుకుసాగుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. 2024-25 నుండి 2026-27 వరకు మైనారిటీల సంక్షేమ శాఖకు రూ.16,147.23 కోట్ల బడ్జెట్ కేటాయించగా, గత రెండేళ్లలో రూ.9,759.70 కోట్లు వ్యయం చేయబడిందని మంత్రి మిగతా 2లో..

## సురక్షితంగా భారతపోర్ట్‌కు ఆయిల్ ట్యాంకర్



**న్యూఢిల్లీ, జూలై 2 (ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో హర్మూజ్ జలసంధిలో ప్రయాణించిన ఒక చమురు ట్యాంకర్ కొన్నిగంటల క్రితం ఒడిశాలోని పారాదీప్ పోర్ట్ ను చేరుకుంది. ఆ నౌక జలసంధి మీదుగా వస్తున్నప్పుడు.. దానిపై దాడి జరిగింది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో చేసిన ప్రయాణం గురించి పారాదీప్ పోర్ట్ అథారిటీ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 2 మిలియన్ బ్యారెళ్ల ఇరాక్ చమురును మోసుకొచ్చిన ఆ నౌక పేరు ఎంటీ సన్మార్ హెరాల్డ్. ఇరాన్ జలాల్లో ఉన్నప్పుడు ట్యాంకర్‌పై దాడి జరిగిందని పోర్ట్ అథారిటీ వెల్లడించింది. కార్గోతోపాటు అందులోని సిబ్బంది భద్రత దృష్ట్యా.. ఘటన అనంతరం నౌక తన మార్గాన్ని మార్చుకున్నట్లు తెలిపింది. ఎలాంటి భద్రతా ఉల్లంఘనలు లేకుండా భారత నౌకాదళంతో సమన్వయం చేసుకుంటూ దేశ తీరంవైపు ప్రయాణాన్ని కొనసాగించినట్లు వెల్లడించింది. ఈ నౌకపై తుపాకులతో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. అయితే, ఇది ఎవరు చేశారన్నది మాత్రం తెలియరాలేదు. తాజాగా పారాదీప్ పోర్ట్‌కు 22 కి.మీ.దూరంలో ఇది లంగరేసింది. దానిలో నుంచి ఇప్పుడు చమురును అన్‌లోడ్ చేయనున్నారు.

నీ ప్రతి పనిలోనూ ఆచరణాత్మకతను కనబరచు. ఆచరణ కొరవడిన అనేక సిద్ధాంతాల వల్లే దేశం పూర్తిగా భ్రష్టుపట్టింది.


## నేటి మనదేశమ్ సంపాదకీయం

# తెలంగాణలో సవాళ్ల రాజకీయాలు !

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్లు ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఎపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొడ్డలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఎపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్ఎస్ నేతలు సవాళ్లు విసురుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు.కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరిచిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతాఓక ఎత్తయితే విపక్ష బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపతేం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడు తోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .

# న్యాయ ప్రక్రియలో ఏఐ వినియోగం

## – సుప్రీంకోర్టు సీరియస్



**న్యూఢిల్లీ, జూలై 2 (ఆర్ఎన్ఎ):** న్యాయ ప్రక్రియలో కృత్రిమ మేధ వినియోగంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ధ్రువీకరించని ఏఐ ఆధారిత సమాచారం న్యాయ వ్యవస్థ సమగ్రతను దెబ్బ తీస్తుందని అభిప్రాయపడింది. దీనిని నియంత్రించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించింది. న్యాయ ప్రక్రియలో ఏఐ వినియోగాన్ని పరిశీలించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను సుప్రీం కోర్టుఆదేశించింది. ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ దివాలా కేసులో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పుపై జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆలోక్ అరాధేలతో కూడిన సుప్రీం ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. నకిలీ, ఉనికిలో లేని పూర్వ తీర్పులను అందులో ప్రస్తావించారని, ఏఐ టూల్స్ సాయంతో దానిని సృష్టించినట్లు ధర్మాసనం గుర్తించింది. కల్పిత సమాచారాన్ని ప్రస్తావించడం న్యాయ ప్రక్రియకు చాలా హానికరమని పేర్కొన్న సర్వోన్నత న్యాయస్థానం.. ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. సరైన ధ్రువీకరణ లేకుండా రూపొందించే ఈ ఏఐ తీర్పులపై కఠినంగా వ్యవహరించాలని న్యాయస్థానాలకు సూచించింది.

# మొదటి పేజీ తరువాయి

## ఏపీ నుంచి అమలులోకి వీబీ జీ రామ్ జీ పథకం



కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలుత చేపట్టారు. ఈ పథకం కింద స్థానిక లబ్దిదారులకు కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలు కలిసి వీబీజీ రామ్ జీ జాబ్ కార్డులను అందజేశారు. కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ లు వీబీ జీ రామ్ జీ ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. ఈ పథకం కింద సమాచార బుక్ లెట్, కంపెండియం ఆఫ్ ఆర్టికల్స్ ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విడుదల చేశారు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఆజివికా మిషన్ పోర్టల్ ను నేతలు ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.." వీబీ జి రామ్ జీ పథకం ఏపీలోని రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావటం చారిత్రాత్మకం. గతంలో నరేగా రాయలసీమ ప్రాంతం నుంచే ప్రారంభమైంది. ఇప్పుడు కూడా వీబీజీ రామ్ జీ పథకం ఇక్కడి నుంచే ఆవిష్కృతం అయ్యింది. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్రం మరో రూ.4 వేల కోట్ల వ్యయంతో వీబీజీ రామ్ జీ కింద పనులు చేపడతాం. రూ.11 వేల కోట్ల పైచిలుకు మొత్తంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో ఈ పథకం కింద గ్రామాల రూపు రేఖలు మారతాయి. 125 రోజుల పని దినాలతో గ్రామీణ అభివృద్ధికి కావాల్సిన ఏ పనైనా చేపట్టేందుకు వీబీజీ రామ్ జీ కింద అవకాశం కల్పిస్తోంది. రహదారులు, డ్రైనేజీలు, కాలువలు ఇలా వేర్వేరు ఆస్తుల కల్పనకు ఆస్కారం ఉండేలా ఈ పథకం వినియోగిస్తాం. జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ లాంటి సాంకేతికతతో పూర్తి పారదర్శకంగా ఈ పథకం నిర్వహిస్తాం. గాలేరు నగరి నుంచి కోడూరుకు నీళ్లు తీసుకువస్తాం, జలధార ద్వారా భూగర్భ జలాలను కూడా పెంచుతాం. రాష్ట్రాలు వ్యయం చేసేలా ఈ పథకం చేపట్టటం భారం కాదు బాధ్యత. 13,226 గ్రామాల్లో ఒకే మారు గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కే దక్కింది. 7,000 కి.మీ. మేర సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు, 1.07 లక్షల ఫార్మ్ పాండ్లు, 1,373 కి.మీ మేర గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల సాగు జరిగింది. ఉపాధి హామీ పనుల నిమిత్తం 55.44 కోట్ల పని దినాలు కల్పించి, రూ.16,695 కోట్లు ఖర్చు చేశానీ. ఈ ఏడాది 10 వేల కి.మీ. గ్రావెల్ రోడ్లు, 1,500 కి.మీ. సిమెంట్, బీటీ రోడ్లు, 500 కి.మీ. మేజిక్ డ్రైన్లు, లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యంగా పొలాలకు వెళ్లే డొంక రోడ్లు కూడా జీ రామ్ జీ పథకం కింద నిర్మించవచ్చు". అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జల్ జీవన్ మిషన్ సహా 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను గత పాలకులు నిర్వీర్యం చేస్తే వాటిని తిరిగి పునరుద్ధరించామని సీఎం అన్నారు. రూ.28 వేల కోట్లతో వివిధ పథకాలు చేపడుతున్నామని.. విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెడతామని చెప్పి రెండేళ్లలో మాట నిలుపుకున్నామని వివరించారు. సీఎం మాట్లాడుతూ "కేంద్రం అమరావతికి సహకారం అందించింది. వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతోంది. ఎన్నికల ముందు ఓ మాట ఎన్నికలు అయ్యాక మరో మాట మాట్లాడారు. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతున్నారు. ఇది ఎవరికైనా అర్థం అయ్యిందా. అమరావతిని ఆపటం ఎవరి తరమూ కాదు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టటంతో పాటు రైల్వే జోన్ సాధించాం. గూగుల్ డేటా సెంటర్ తో పాటు పుట్టపర్తిలో ఆమ్కా ఫైటర్ జెట్ తయారీ యూనిట్ వస్తోంది. రాయలసీమను అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలుపుతాం. దేశంలోనే ఉద్యాన పంటలకు కేంద్రం రాయలసీమ. త్వరలోనే రూ.40 వేల కోట్లతో ప్రభుత్వం, రూ.60 వేల కోట్ల ప్రైవేటు ప్రైవేటు పెట్టుబడులు తెస్తాం. మదనపల్లిలో హార్టీకల్చర్ హబ్ కు త్వరలోనే శంకుస్థాపన చేస్తాం. సత్యవేడులో హీరో మోటార్స్ సైకిళ్ల తయారీ యూనిట్ ఉంది. తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ వస్తోంది. ప్రజల మనిషి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అడిగిన వెంటనే సమస్యల్ని పరిష్కరించారు. తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు, రహదారులు, పీఎంఏవై కోసం నిధులు ఇచ్చారు. దీనికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈ వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా ఏపీని తయారు చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బంగారం గనులు ఉన్న జొన్నగిరి పేరును చారిత్రక పేరు స్వర్ణ గిరిగా మార్చాం. నిస్వార్థంగా పనిచేసే కూటమి నేతలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నాను. భారత మాతకు వికసిత్ భారత్ – తెలుగు తల్లికి స్వర్ణాంధ్ర సంకల్పం చేశాం. స్వర్ణాంధ్ర ప్రదేశ్ అన్ స్టాపబుల్. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## తిరుచ్చి ఉప ఎన్నికపై వీడని ఉత్కంఠ

రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు త్రిష గానీ, ముఖ్యమంత్రి విజయ్ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం అంతా ఊహాగానాలకే పరిమితమైంది. అయినప్పటికీ త్రిష రాజకీయ అరంగేట్రంపై తమిళనాట ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. అధికారిక ప్రకటన వస్తేనే ఈ వార్తలకు పూర్తి స్పష్టత రానుంది. ఇక సినిమాల విషయానికి వస్తే త్రిష ప్రస్తుతం సినిమాలతోను బిజీగా ఉంది. ఇటీవల కరుప్పు చిత్రంతో పెద్ద హిట్ కొట్టిన త్రిష ఇప్పుడు చిరంజీవి విశ్వంభర సినిమాతో సందడి చేసేందుకు సిద్ధమైంది. మరోవైపు పలు చిత్రాలకి సైన్ చేసింది. ఈ వయస్సులోను త్రిష వరుస అవకాశాలు అందిపుచ్చుకోవడం , అలానే మంచి హిట్స్ దక్కించుకోవడం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

## శ్రీవారి సేవలో మంత్రి లోకేశ్

ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అనంతరం తిరుపతిలోని భూపాల్ హౌసింగ్ కాలనీలో తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ కే. గౌతమి శ్వేత నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, కే. గౌతమి శ్వేతలను మంత్రి లోకేశ్ ఆశీర్వదించారు. వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్న ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతలు ఉంగరాలు మార్చుకుని నిశ్చితార్థ వేడుకను నిర్వహించారు. మంత్రి లోకేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివాహానికి ముందు జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. పలువురు టీడీపీ నేతలు, పార్టీ కార్యకర్తలు కూడా హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల జీవితంలో ఈ శుభ ఘట్టం చిరస్మరణీయంగా నిలవాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. రాత్రి తిరుమలలోని శృంగేరీ శారద పీఠంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతల వివాహం జరగనుంది. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

మహమ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ట్రాఫిక్ ఎస్ఎస్పీ రాజా ఆదిల్ హమీద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. తర్వాత, భక్తులు బస చేసే మొదటి ప్రధాన కేంద్రం చందర్‌కోట్. ఈ పవిత్ర యాత్ర సాఫీగా, సురక్షితంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టింది. చందర్‌కోట్ లంగర్ సైట్ వద్ద భక్తులకు అవసరమైన వసతులు, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు. పోలీస్, ఆర్మీ, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ , ట్రాఫిక్ పోలీస్, ఆరోగ్య శాఖ, ÷ూఆఖీఈ, ÷ర్ అండ్ ఎమ్జ్గ÷న్సీ సర్వీసెస్ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

## చిన్న పరిశ్రమల అనుసంధానంతో ఏపి వర్క్-స్టడీ మోడల్ దేశానికే ఆదర్శం

చెందిన 250కుపైగా కంపెనీలు వివిధ రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పరిశ్రమ, విద్యావ్యవస్థలను ఇంత సమగ్రంగా అనుసం ధానించిన కేంద్రాలు దేశంలోనేకాక ప్రపంచవ్యాప్తంగా కూడా చాలా అరుదు అని వ్యాఖ్యానించారు. ఎస్ఐయూలో విద్యార్థులు తాము విద్యను అభ్యసించే క్యాంపస్‌కు సమీపంలోనే ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలతో కలిసి నేర్చుకునే, పనిచేసే అవకాశాన్ని పొందనున్నారని పేర్కొన్నారు.నాలుగేళ్ల డిగ్రీ చదివిన విద్యార్థి, మొదటి సంవత్సరం నుండే వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్‌ల ద్వారా సంపాదించిన 2 సంవత్సరాలకు పైగా నిజమైన పరిశ్రమ అనుభవాన్నిసంపాదించి పట్టభద్రుడిగా బయ టకు వస్తారని శ్రీసిటీఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఎస్ఐయు పాలకమండలి చైర్మన్ శ్రీనిరాజు పేర్కొన్నారు. దీనికితోడు, పరిశ్రమతో కలిసి రూపొందించిన పాఠ్యప్రణాళిక, విద్యార్థులకు అధిక ఉపాధి అవకాశాలను కల్పిస్తుంద న్నారు. వినూత్నవర్క్–స్టడీ డ్యూయల్ మోడల్ విద్యావి ధానానికి ఎస్ఐయూ మార్గదర్శకత్వం. భారతదేశంలో ప్రతివిద్యార్థి పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలతో పట్టభద్రుడై ఉపాధి అవకాశాలను పొందేలా రూపొందిం చిన వినూత్నవర్క్–స్టడీ డ్యూయల్ మోడల్ విద్యావిధానా నికి ఎస్ఐయూ మార్గదర్శకత్వం వహిస్తోంది. భారత ఉన్నతవిద్య కీలక మలుపులో ఉన్నసమయంలో ఈ వినూత్నప్రయోగానికి శ్రీకారం చుట్టారు. దేశంలో ప్రతి సంవత్సరం 90 లక్షలకు పైగా విద్యార్థులు పట్టభద్రులవుతున్నప్పటికీ, వారిలో కేవలం 42.6 శాతం మంది మాత్రమే ఉపాధికి తగిన నైపుణ్యాలను కలిగి ఉన్నట్లు అంచనా. ఉద్యోగాలు పొందిన వారిలో సగానికిపైగా తమ అర్హతలకు తగని ఉద్యోగాల్లో పనిచేస్తుం డగా, 80 శాతానికి పైగా సంస్థలు తగిన నైపుణ్యాల కొరతను ఎదుర్కొంటున్నట్లు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితిని భారత్ ఎంప్లాయబిలిటీ అండ్జాబ్సాలెంజ్గా అభివర్ణిస్తున్న ఎస్ఐయూ, ఈ సవాలుకు ఆచరణాత్మక పరిష్కారాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ మోడల్‌ను రూపొందించింది. ఎస్ఐయూ అమలుచేస్తున్నవర్క్–స్టడీ డ్యూయల్మోడల్‌లో విద్యార్థులు తమ సమయాన్నిమూడింట ఒకవంతు క్యాంపస్‌లో అకడమిక్విద్యను అభ్యసించేందుకు, మిగిలిన సమయాన్నిపరిశ్రమ భాగస్వామ్య సంస్థల్లో ఇంటర్న్‌లుగా పనిచేసేందుకు కేటాయిస్తారు. పరిశ్రమ భాగస్వామ్య సంస్థల్లో ఇంటర్న్‌షిప్నిర్వహిస్తున్నవిద్యార్థులకు తొలి సంవత్సరంనుంచే నెలకు కనీసం రూ.10,000 స్టైఫండ్ అందజేస్తారు. విద్యార్థులనైపుణ్యాలు, ఉత్పాదకత పెరుగుతున్నకొద్దీ స్టైఫండ్మొత్తాన్ని మరింత పెంచాలని పరిశ్రమ భాగస్వాములు భావిస్తున్నారు. దీంతో ఎస్ఐయూలో నాలుగేళ్ల డిగ్రీ పూర్తి చేసే విద్యార్థులు సుమారు రెండేళ్లకుపైగా వాస్తవ పరిశ్రమ అనుభవంతో పట్టభద్రులుగా బయటకువస్తారు.విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను సొంతంచేసు కునేలా పాఠ్యప్రణాళికను పరిశ్రమ భాగస్వాములతో కలిసి రూపొందించారు.కృత్రిమమేధస్సు(ఏఐ) ఆధారిత పారిశ్రామికరంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలను ప్రతిసంవత్స రం నవీకరిస్తూ, భవిష్యత్ ఉద్యోగానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలను విద్యార్థులు పొందేలా చర్యలు తీసుకుంటున్నారు.వ్యవస్థాపకతను ప్రోత్సహిం చేదిశగా ఎస్ఐయూ తన క్యాంపస్‌లో 'స్టేషన్–ఎస్' పేరుతో ఇంక్యుబేషన్సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసింది. క్యాట్–ఐ వెంచర్క్యాపిటల్ఫండ్ అయిన స్టేషన్–ఎస్ఙజ్ఞానసర్కిల్వెంచర్స్సహకారంతో సుమారు 10 స్టార్టప్ లు కార్యకలాపాలు ప్రారంభించాయి. ఈ ఏడాది నాలుగు కోర్సులలో అడ్మిషన్లు, ఎస్ఐయు 2026--27 విద్యాసం వత్సరానికి నాలుగు అండర్ గ్రాడ్యుయేట్ కార్యక్రమాలను అందిస్తోంది. బి టెక్ ఇన్ కంప్యూటర్సైన్స్ ఙ ఇంజనీరింగ్ (స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఙ ఏఐ), బి టెక్ ఇన్ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ (స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చ రింగ్), ఫైనాన్స్ ఙ అకౌంట్స్, డిజిటల్ మీడియా ఙ కమ్యూనికేషన్స్‌లో బి.బి.ఏ కోర్సులతో 2026--27 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు www.thesiu.org ద్వారా ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాలకు సంబంధించిన వివరాలకోసం: 91 8977763331 / 91 8977763332. ఈమెయిల్: admissions@thesiu.org ను సంప్రదించవచ్చు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్ లో లోకేష్ సందడి.వివిధ సందర్భాల్లో ఇప్పటి వరకు నాలుగుసార్లు శ్రీసిటీ లో పర్యటించిన మంత్రి లోకేష్, మొట్టమొదటి సారి శ్రీసిటీ బిజినెస్ సెంటర్ లో అడుగుపెట్టారు. ఈ సమయంలో ఇక్కడ ఏర్పాటు శ్రీసిటీ మోడల్, వివిధ పరిశ్రమల ఉత్పత్తుల నమూనాలు, పలువురు ముఖ్య నేతలు, అధికారుల సందర్శనల చిత్ర మాలికలతో పాటు భవనం నలుమూలల ఎంతో ఆసక్తిగా పరిశీలించారు. అలాగే యూనివర్సిటీ ప్రారంభోత్సవం అనంతరం ఎస్ ఐ యు, శ్రీసిటీ ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు, కంపెనీల ప్రతినిధులు ఇలా పలువురిని ఆప్యాయంగా పలుకరిస్తూ ఫోటోలు దిగడం ద్వారా ఆవరణలో సందడి వాతావరణం నెలకొంది.

## మైనారిటీ సంక్షేమం, సాధికారత, న్యాయపాలనలో చారిత్రాత్మక పురోగతి

తెలిపారు. ఇందులో మైనారిటీల సంక్షేమ కార్యక్రమాల అమలుకు రూ.4,850.91 కోట్లు నేరుగా ఖర్చు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా మైనారిటీ వర్గాలకు విస్తృత స్థాయిలో ప్రయోజనం చేకూరిందన్నారు. ఔఖీ భరోసా పెన్షన్ ద్వారా 3.38 లక్షల మందికి రూ.3,668.74 కోట్లు, తల్లికి వందనం కింద 92,105 కుటుంబాలకు రూ.138 కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ ద్వారా 67,852 మంది విద్యార్థులకు రూ.165 కోట్లు, దీపం–2 పథకం ద్వారా 12.66 లక్షల కుటుంబాలకు రూ.221.36 కోట్లు అందించడం జరిగిందని మంత్రి తెలిపారు. అలాగే ఆటో డ్రైవర్ సేవలో, మెరైన్ ఫిషింగ్ బ్యాన్ రిలీఫ్, ఇమామ్‌లు, మౌజన్లు, పాస్టర్ల గౌరవ వేతనాలు, ఖఓఏఐ, హజ్ యాత్ర, రంజాన్, హైటీ, మైనారిటీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాలకు నిధులు విడుదల చేయడంతో పాటు, సిఇడిఎమ్ ద్వారా 10,543 మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి మైనారిటీల సామాజిక, విద్యా, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నదన్నారు. విద్యే మైనారిటీల సాధికారతకు ప్రధాన సాధనంగా భావిస్తున్న ప్రభుత్వం, "తాలిమ్–ఎ–హునర్" పథకం ద్వారా 250 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.6 కోట్ల వ్యయంతో కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ విద్యను అందిస్తోందన్నారు. అలాగే టెట్‌కు 4,300 మంది, డిఎస్‌సి–2025కు 1,780 మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించగా, వారిలో 435 మంది కాల్ లెటర్లు పొందారన్నారు. అదేవిధంగా 350 మంది విద్యార్థులకు నీట్, ఎంసెట్ కోచింగ్, 7,000 మంది ఎస్ఎస్‌సి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉచిత వర్కుబుక్‌లు అందించడంతో పాటు, సిఇడిఎమ్ ఆన్‌లైన్ స్టూడియో మరియు సిఇడిఎమ్ యాప్ ద్వారా ఆధునిక ఆన్‌లైన్ కోచింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, నిర్వహణలో ప్రభుత్వం కీలక విజయాలు సాధించిందన్నారు. 1,500 వక్ఫ్ సంస్థల సర్వేను పూర్తి చేయడంతో పాటు, 88 ఎకరాల వక్ఫ్ భూమిని ఆక్రమణదారుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. తొలిసారిగా 616.65 ఎకరాల వక్ఫ్ భూమికి తహసీల్దార్ల ద్వారా లీజు వేలం నిర్వహించగా, 5,028 వక్ఫ్ సంస్థల వివరాలను సెంట్రల్ పోర్టల్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే వక్ఫ్ సంస్థల నిర్మాణాలు, మరమ్మతుల కోసం రూ.5.74 కోట్లు విడుదల చేసి వాటి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. హజ్ యాత్రికులకు అత్యుత్తమ సేవలు అందిస్తూ, హజ్–2025లో 1,630 మంది, హజ్–2026లో 1,990 మంది యాత్రికులు విజయవంతంగా యాత్ర పూర్తి చేసేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. విజయవాడ ఎంబార్కేషన్‌ను ప్రోత్సహిస్తూ 2025లో 72 మందికి రూ.72 లక్షలు, 2026లో 331 మందికి రూ.3.31 కోట్లు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, లగేజీ ఆలస్యమైన 177 మంది యాత్రికులకు రూ.24.40 లక్షల నష్టపరిహారాన్ని విమానయాన సంస్థ ద్వారా ఇప్పించి యాత్రికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. పిఎంజెవికే కింద రూ.231 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టిన ప్రభుత్వం, 2026–27లో రూ.1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు అమలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందన్నారు. తొలి విడతలో రూ.101 కోట్లతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు, 5 పాలిటెక్నిక్ కళాశాలలు, అనంతపురంలోని కెజిఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అదనపు భవనం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. అదేవిధంగా పిఎం – వికాస్ పథకం ద్వారా రూ.10.60 కోట్లు సమీకరించి 1,500 మందికి నైపుణ్య శిక్షణ అందిస్తోందన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో "ఆవో ఉర్దూ సీఖేన్" సమ్మర్ క్యాంపు, "సురూర్–ఎ–ఉర్దూ" మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా 36 కంప్యూటర్ శిక్షణా కేంద్రాల ద్వారా 8,080 మందికి శిక్షణ అందించడం జరిగిందన్నారు. అలాగే శిక్షణా కేంద్రాల ఆధునీకరణ కోసం 216 కంప్యూటర్ల కొనుగోలుకు రూ.2.75 కోట్లు వ్యయం చేస్తూ డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీ, హజ్ కమిటీలకు చైర్మన్లు, సభ్యులను నియమించామని తెలిపారు. శ్మశానవాటికలు, ఈద్గా స్థలాల కేటాయింపు, ప్రభుత్వ ఖాజీల నియామకం, పాస్టర్ల మ్యారేజ్ లైసెన్స్ చెల్లుబాటు గడువును 3 సంవత్సరాల నుండి 10 సంవత్సరాలకు పెంచే ఉత్తర్వులు జారీ చేశామని పేర్కొన్నారు.

## ఏపీకి నేను మేనమామ

టన్నుల తోతాపురి మామిడిని మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కొనుగోలు చేస్తుందని ఆయన ప్రకటిం చారు. దీనికి సం బంధించిన పత్రాల ను కూడా సీఎం చంద్ర బాబుకు ఆయన అంద జేశారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహ కారం అందిస్తుందని ఎక్కడా చేయి విడిచి పెట్టేది లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ తమ పుట్టిన రోజున కనీసం ఒక మొక్క నాటేలా సంకల్పం తీసుకోవాలని మంత్రి పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్, మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే అరవశ్రీధర్ సహా ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్న తా ది. కా ం ల ం హాజరయ్యారు.


VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2వ అంతస్తు, "A" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సెవ్రి (పశ్చిమ), ముంబై 400015. మహారాష్ట్ర. CIN నంబర్: U65922MH2005PLC272501

స్థిరాస్తుల అమ్మకానికి ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 తో పాటు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (6) యొక్క ప్రొవిజో కింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఈ-వేలం అమ్మకం నోటీసు.

సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత / సహ-రుణగ్రహీత / తనఖాదారు(ల)కు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, సురక్షిత రుణదాతకు తనఖా పెట్టబడిన, మరియు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనం తీసుకోబడిన, క్రింద వివరించబడిన స్థిరాస్తులను ఇకపై వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ అని పిలవబడును. ఈ సురక్షిత ఆస్తులు "ఉన్నది ఉన్నట్లుగా", "ఏది ఉంటే అది" అనే పద్ధతిలో అమ్మబడతాయి.

ఈ-వేలం ద్వారా "ఏది అందుబాటులో ఉందో" దాని ప్రాతిపదికన. మేము https://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్ ద్వారా బహిరంగ ఈ-వేలం నిర్వహించబోతున్నామని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

| SN | ఖాతా సంఖ్య మరియు రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, తాకట్టుదారుల పేరు | సెక్షన్ 13(2) & 13(2) కింద డిమాండ్ నోటీసు ప్రకారం & మొత్తం & భౌతిక స్వాధీనం తేదీ | ఆస్తి/ఆస్తుల వివరణలు | రిజర్వ్ ధర, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రూపాయలలో) | ఈ-వేలం తేదీ మరియు సమయం, EMD సమర్పణ చివరి తేదీ, తనిఖీ తేదీ |
|---|---|---|---|---|---|
| 1 | HL0000000003113 వెల్లపాండియన్ RS (రుణగ్రహీత), C జేబీ (సహ-రుణగ్రహీత) | డిమాండ్ నోటీసు తేదీ 16/ఫిబ్రవరి/21 & 31/మార్చి/21 నాటికి మొత్తం రూ.1242688/- + వడ్డీ ఖర్చు మొదలైనవి & 22/సెప్టెంబర్/21 | సర్వే నెం 36/1బి, డి నెం 12-270 సమీపంలో, ప్లాట్ నెం 6, మల్లమ్మ గుడి వీధి, చావి రెడ్డి పల్లి రెవెన్యూ వెంకటగిరి మున్సిపాలిటీ, ఆంధ్రప్రదేశ్ 524132 | [illegible] | 20/07/2026 మధ్యాహ్నం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు. 18/07/2026 సాయంత్రం 5:00 వరకు. 10/07/2026 |

ఆసక్తిగల పాల్గొనేవారు/బిడ్డర్లు అందరూ వివరాలు, సహాయం, విధానం మరియు ఈ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణ కోసం https://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా కోరడమైనది.

ఆసక్తిగల బిడ్డరు M/S ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆక్షన్‌టైగర్)ను సంప్రదించగలరు; చిరునామా: ప్రధాన కార్యాలయం: బి-705, వాల్ స్ట్రీట్ II, ఓరియంట్ క్లబ్ ఎదురుగా, గుజరాత్ కాలేజ్ సమీపంలో, ఎల్లిస్ బ్రిడ్జ్, అహ్మదాబాద్ – 380 006 గుజరాత్ (భారతదేశం). సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ రామ్ శర్మ, సంప్రదించవలసిన నంబర్లు: 8000023297/9265562818/9265562821/079-6813 6842/6869. ఇమెయిల్ ఐడి: ramprasad@auctiontiger.net, support@auctiontiger.net

2. నిబంధనలు మరియు షరతులపై మరిన్ని వివరాల కోసం, ఈ-వేలంలో పాల్గొనడానికి దయచేసి https://sarfaesi.auctiontiger.net ను సందర్శించండి.

3. ఆస్తికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం దయచేసి అధీకృత అధికారిని సంప్రదించండి: రాజు రెడ్డి నీలపల్లి సంప్రదింపు నెం. 9949600034

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) ప్రకారం ఇది కూడా ఒక చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు.

తేదీ: 03.07.2026 అధీకృత అధికారి

స్థలం: వెంకటగిరి. వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్

# గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలుపుతాం

-ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర సహకారం అపూర్వం -125 రోజులకు పని దినాలు పెంచడం ద్వారా గ్రామీణులకు ఉపాధి భరోసా

-వీబీ జీ రాంజీ) పథకం ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి ప్రసంగం



**తిరుపతి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**'భవిష్యత్తు భారతదేశం కేవలం నగరాల అభివృద్ధిలోనే లేదు.. సంపన్నమైన, సమ్మిళిత అభివృద్ధి కలిగిన గ్రామాల్లో ఉంది. గ్రామీణ భారతానికి కొత్త శక్తినిచ్చేలా వీబీజీరాంజీ) పథకం నూతనంగా సేవలు అందించనుంద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతికి, భవిష్యత్తుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎనలేనిదని, దేశంలో వి బి జి రామ్ జి నిధుల కేటాయింపులో ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర ప్రభుత్వం తృతీయ స్థానం కల్పించడం కేంద్రం అందిస్తున్న సహకారానికి మచ్చుతునక అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశంలో మొదలుపెట్టబోతున్న వి బి జి రామ్ జి పథకాన్ని గురువారం రైల్వే కోడూరు నియోజకవర్గం, ముక్కావారి పల్లెలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర సహాయ మంత్రులు డా. పెమ్మసాని చంద్రశేఖర్,కమలేష్ పాశ్వాన్ ల సమక్షంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "జాతీయస్థాయి కార్యక్రమానికి రైల్వే కోడూరు నియోజకవర్గం వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు.శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో గ్రామీణ భారతం కొత్తదశలోకి ప్రయాణించాలని, 2047 వికసిత్ భారత్ లో భారత దేశ గ్రామాలు అభివృద్ధితో కళకళలాడాలని కోరుకుంటున్నానన్నారు.. నిజమైన సిరిసంపదలకు గ్రామీణ భారతదేశ మూలం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.. గ్రామీణ భారత భవిష్యత్తుకు మిషన్ గా వీబీజీరాంజీ పథకం ఉపయోగపడుతుందని. గతంలో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్తగా తెచ్చిన మార్పులు గ్రామాలకు ఆర్థిక ఊతం ఇస్తాయన్నారు. .శ్రామికుల పని దినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం ద్వారా అదనంగా 25 రోజులు ఉపాధి భరోసా లభించి,పల్లెల్లో ఆర్థిక వృద్ధి పెరుగుతుందన్నారు. పంటల సాగు సమయంలో రైతులకు కూలీల కొరత లేకుండా 60 రోజులపాటు పథకానికి విరామం ఇవ్వడం ద్వారా రైతులకు కూడా మేలు జరుగుతుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వి బి జి రాంజీ పథకంలో 2026- 27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ. 7,700 కోట్లను కేటాయించిందని.ఇది భారతదేశంలోనే మూడవ అతిపెద్ద కేటాయింపు అని చెప్పొచ్చు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని గ్రామాలకు సరికొత్త అభివృద్ధి అంది. ఆర్థికంగానూ గ్రామీణ ప్రాంతాల్లో శ్రామికులకు మేలు చేకూరుతుందన్నారు.

**రెండేళ్లలో గ్రామీణాభివృద్ధికి కొత్త బాటలు**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అంతే వేగంగా గ్రామీణ అభివృద్ధికి బాటలు వేసిందని. గత రెండేళ్లలో ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకొని రూ. 16,695 కోట్లను వెచ్చించి ఎన్నో అద్భుతమైన ప్రజా ఉపయోగ పనులు చేశామని పవన్ కల్యాణ్ వెల్లడించారు.రెండు దశల పల్లె పండుగ లలో భాగంగా 7 వేల కిలోమీటర్ల సిసి రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 పశువుల నీటి తొట్టెలు, అడవి తల్లి బాట పథకంలో భాగంగా 1,373 గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణం, 1.66 లక్షల ఉద్యాన వన పంటల సాగు, 55 కోట్ల, 40 లక్షల పని దినాలను కల్పించినట్లు వివరించారు.. స్వచ్ఛ రథాల ద్వారా గ్రామీణ ఆంధ్రప్రదేశ్లో పారిశుధ్యం మెరుగుదలకు చైతన్యం కలిగించే కార్యక్రమాలు నిర్వహించామని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన మ్యాజిక్ డ్రైయిన్లు జాతీయస్థాయిలో రోల్ మోడల్ అయ్యాయన్నారు.. మ్యాజిక్ డ్రైన్ ల వల్ల గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలైందని చెప్పారు.. 2026-27 ఆర్థిక సంవత్సరంలో కూడా రైతులకు అనువుగా ఉండేలా పదివేల కిలోమీటర్ల డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని. 15వేల కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లు నిర్మాణానికి. 500 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైయిన్లు నిర్మాణం చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ను అగ్రగామిగా నిలిపామని చెప్పారు.అభివృద్ధి అంటే కేవలం పనులు చేయడమే కాదు ఆ పనులు చేసే శ్రామికుల జీవనానికి కూడా భరోసా అందించే కార్యక్రమం కావాలని చెప్పారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ముందుకు వెళ్లాలని. అభివృద్ధిలో ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించాలి అనే లక్ష్యంతో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖలో వినూత్న మార్పులతో ముందుకు వెళ్తున్నట్లు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## తిరుపతి జిల్లా

## నాగభూషణం కర్మ క్రియలకు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరు



**చంద్రగిరి, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ ఇర్విశెట్టివారిపల్లెకు చెందిన పాలకూరు నాగభూషణం కర్మ క్రియలకు రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షత్ రెడ్డి హాజరయ్యారు. పనపాకం గ్రామ పంచాయతిలో ఎలక్ట్రీషియషన్ గా గత 20 సంవత్సరాలు నుంచి పనిచేస్తున్న ఆయన ఇటీవల పంచాయతి వీధి లైట్లు అమర్చుతుండగా విద్యుత్ షాక్ తో మరణించారు. ఆ విషయం స్థానిక వైఎస్సార్ సిపి నాయకుల ద్వారా తెలుసుకుని గురు వారం జరిగిన నాగ భూషణం దశ దిన కర్మ క్రియలకు హర్షిత్ రెడ్డి హాజరై చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ కుటుంబానికి అండగా ఉంటామని హామి ఇచ్చారు.అనంతరం కర్మక్రియలు జరుగుతున్న చోటికి వెళ్లి అందరని పలకరించారు. నివాళి అర్పించిన వారిలో వైస్ ఎంపీపీ వెంకటరత్నం, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, పానేటి చెంగల్రాయులు, వరలక్ష్మి, సీహెచ్ రెడ్డెప్ప,అమాస నాగేశ్వరరావు, సంగాపు అజయ్ కుమార్, పాలకూరు గురుస్వామి, అమాస భాస్కర్, సుభాసని, అమాస పవన్ లతో పాటు స్థానికులు వున్నారు.

## జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పిఎం శ్రీ పథకం అమలుపై ఆర్‌జెడి తనిఖీ



**చంద్రగిరి, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి పట్టణంలోని శ్రీ పద్మావతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో పీఎం శ్రీ పథకం అమలుపై ఆర్‌జేడీ కె. శామ్యూల్ క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పి--2020) ప్రకారం పీఎం శ్రీ పాఠశాలల్లో అమలు చేస్తున్న 21 పారామీటర్లను పరిశీలించారు. ముఖ్యంగా డిజిటల్ మౌలిక వసతులు, విద్యా నాణ్యత, గ్రంథాలయం మరియు ప్రయోగశాలలు, విద్యార్థుల సంక్షేమం, పరిశుభ్రత, క్రీడా సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, ఉపాధ్యాయుల సామర్థ్యాభివృద్ధి, పాఠశాల పరిపాలన తదితర అంశాల అమలును సమీక్షించి, పథకం లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆర్‌జేడీ సూచించారు.ఈ తనిఖీలో ఎఎంఓ చంద్రశేఖర్ నాయుడు,ఎఎంఓ వి. మనోహర్, ఎంఈఓ --1 లలిత కుమారి, ఎంఈఓ--2 భాస్కర్ బాబు, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ రెడ్డి మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పీఎండీఎస్ క్షేత్రాలను సందర్శించిన వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బీ. రాజశేఖర్



**చంద్రగిరి, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, చిన్నరామాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ క్షేత్రాలను వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బీ. రాజశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా పెల్లెటైజేషన్ చేసిన పి ఎం డి ఎస్ విత్తనాలతో పి వేసిన ఫీల్డ్ మరియు పెల్లెటైజేషన్ చేయని పఫీల్డ్ పరిశీలించి, పంట ఎదుగుదల, మొలక శాతం, పంట అభివృద్ధిని పోల్చి పరిశీలించారు.అనంతరం పిఎండిఎస్ పెల్లెటైజేషన్ విధానాన్ని అమలు చేస్తున్న రైతు చంద్రబాబు నాయుడు తో ప్రత్యేకంగా మాట్లాడి, ఈ విధానం వల్ల కలుగుతున్న ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. రైతు మాట్లాడుతూ, ద్వారా పండించిన పశుగ్రాసాన్ని పశువులకు అందించడం వల్ల పాల ఉత్పత్తి క్రమంగా పెరగడంతో పాటు పాల నాణ్యత కూడా మెరుగుపడిందని తెలిపారు. ముఖ్యంగా పాలలో ఫ్యాట్ శాతం పెరగడం వల్ల పాల సేకరణ కేంద్రం ఇతర రైతుల పాలతో పోలిస్తే లీటరుకు రూ.2 నుంచి రూ.3 వరకు అదనపు ధర చెల్లిస్తున్నట్లు వివరించారు.అదేవిధంగా, తాను పండిస్తున్న పశుగ్రాసాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) గోశాలకు కిలోకు రూ.2 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఒక్క సీజన్‌లో సుమారు 10 నుంచి 12 టన్నుల పశుగ్రాసాన్ని విక్రయించడం ద్వారా దాదాపు రూ.25 వేల వరకు అదనపు ఆదాయం పొందుతున్నట్లు రైతు వెల్లడించారు. దీంతో విధానం రైతులకు పశుగ్రాస భద్రతతో పాటు అదనపు ఆదాయ వనరును కూడా కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ బీ. రాజశేఖర్ పశుసంవర్ధక శాఖ అధికారులతో కూడా ద్వారా ఉత్పత్తి అవుతున్న పశుగ్రాసం, దాని ప్రయోజనాలు మరియు రైతులకు కలిగే లాభాలపై చర్చించారు.అనంతరం పెల్లెటైజేషన్ చేసిన విత్తనాలను పొలంలో వెదజల్లుతూ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి రైతు పెల్లెటైజేషన్ విధానాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ విధానం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని, పశుగ్రాస ఉత్పత్తి, పాడి పరిశ్రమ అభివృద్ధి మరియు రైతుల ఆదాయ పెరుగుదలకు ఒక సమర్థవంతమైన విధానమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి ఏ షణ్ముగం , ఏడిఏ భవానిశంకర్, వి ఏ ఎస్ వంశీ మరియు పట్టాభి రెడ్డి, మాస్టర్ ట్రైనర్ శ్రీదేవి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐఐఇఏ ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్‌లు,పండ్లు పంపిణీ

**నాయుడుపేట,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఇఏ )76వ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గురువారం నాయుడుపేట ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, గర్భిణీ స్త్రీలకు బ్రెడ్‌లు,పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయుడుపేట బ్రాంచి కార్యదర్శి ఎం. సునీల్ మాట్లాడుతూ జూలై 3న నాయుడుపేట ఎల్ ఐ సి కార్యాలయ ఆవరణలో భారీ స్థాయిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరంతో పాటు ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో రక్తదాన శిబిరంలో పాల్గొని ప్రాణదాతలుగా నిలవాలని, ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచి మేనేజర్ ప్రసన్న కుమార్, ఐ సి ఈ యు బ్రాంచి అధ్యక్షుడు సురేంద్ర బాబు, సభ్యులు రాజేశ్వరి,ఎల్ ఐ ఏ ఎఫ్ ఐ నాయకులు ఏవీవీ కుమార్, బాలగురునాథం, ప్రశాంత్,మధు రెడ్డి,సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌ని కలిసిన కొట్టేసాయి ప్రసాద్



**శ్రీకాళహస్తి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైల్వే కోడూరు సభకు హాజరయ్యేందుకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ మరియు జనసేన పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే శ్రీకాళహస్తి దేవస్థానాన్ని ప్రథమ స్థానంలో నిలిపినందుకు కొట్టే సాయి ప్రసాద్ ని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా, దేవస్థానం అభివృద్ధితో పాటు జనసేన పార్టీని కూడా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మరింత బలోపేతం చేసి, పార్టీ నిర్మాణానికి కృషి చెయ్యాలని సూచించారు.

## బొజ్జల కుటుంబంతో స్నేహబంధం మరవలేనిది : నారా లోకేష్



**శ్రీకాళహస్తి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నారా కుటుంబానికి బొజ్జల కుటుంబ సభ్యులతో స్నేహబంధం విడదీయలేనిదని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ముక్కంటి ఆలయ దర్శనానంతరం శ్రీకాళహస్తి మండలం పూరిందూరిలోని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్వగృహంలో మంత్రి లోకేష్ ఆతిథ్యం స్వీకరించారు. బొజ్జల కుటుంబ సభ్యులు లోకేష్ కు గుమ్మడికాయతో దిష్టి తీసి సాదర స్వాగతం పలికారు. తన తండ్రి సీఎం చంద్రబాబు నాయుడు తో పాటు మంత్రిగా బొజ్జల గోపాల కృష్ణారెడ్డి కలిసి చేసిన అభివృద్ధి అంశాలను గుర్తు చేసుకున్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తుది శ్వాస విడిచే కొద్ది రోజుల ముందు కూడా స్నేహితులిద్దరూ హైదరాబాదులో ఎంతో సంతోషంగా గడిపారని గుర్తు చేసుకున్నారు. అలాగే ప్రస్తుత ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్ రెడ్డితో తనకు చిన్నతనం నుంచి ఉన్న స్నేహ బాంధవ్యం గురించి ముచ్చటించారు. ఆతిథ్యం అనంతరం అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ తిరుగు ప్రయాణం అయ్యారు.

## శ్రీకృష్ణాలయం నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**నాయుడుపేట ,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేట సమీపంలో సుమారు 2.5 కోట్ల రూపాయల వ్యయంతో నాయుడుపేట యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీకృష్ణ ఆలయం నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా యాదవ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పార్థసారథి దంపతుల తోపాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అమృత సరళ దంపతులకు,నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్,పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. నాయుడుపేట పట్టణంలో ఆధ్యాత్మిక వికాసాన్ని పెంపొందించడంలో భాగంగా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ పెట్టుబడితో శ్రీకృష్ణ ఆలయం నిర్మించడం సంతోషదాయకం అన్నారు. శ్రీకృష్ణ పరమాత్మని దయతో వీలైనంత త్వరగా ఆలయాన్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో యాదవ సంక్షేమ సంఘం నాయకులు భారతాల సాయిరామ్ కిషోర్,పెళ్లకూరు మండల టిడిపి అధ్యక్షులు సంచి కృష్ణయ్య,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు,మాజీ ఏఎంసీ చైర్మన్ ఒట్టూరు కిషోర్ యాదవ్,తెలుగుదేశం పార్టీ నాయకులు పోట్లపూడి రాజేష్, అవధానం సుధీర్,మాధవరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గూడూరులో వైభవంగా చంద్రప్రభ వాహన సేవ

- ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరుస్తున్న బ్రహ్మోత్సవాలు



**గూడూరు,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు పట్టణంలోని రాజావీధిలో వెలసిన భక్తుల కొంగు బంగారం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన 'చంద్రప్రభ వాహన సేవ' కన్నుల పండువగా సాగింది. సాయంత్రం వేళ, ప్రత్యేకంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారు ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, విలువైన ఆభరణాలు, రంగురంగుల విశేష పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించబడిన స్వామి వారిని చూసి భక్తులు పరవశించిపోయారు. ఈ సమయంలో ఆలయ ప్రాంగణం అంతా "గోవిందా.. గోవిందా" అనే నామస్మరణతో మారుమోగింది. చంద్రప్రభ వాహన సేవను వీక్షించేందుకు గూడూరు పరిసర ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీకంటి రామమోహన్ రావు పర్యవేక్షణలో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ అపురూపమైన బ్రహ్మోత్సవ వేడుకల్లో భక్తులందరూ పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ చైర్మన్ శ్రీకంటి రామమోహన్ రావు కోరారు.

## వికసిత్ భారత్ గ్యారెంటీ పథకంతో గ్రామీణ ఉపాధి బలోపేతం

- పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

**సూళ్లూరుపేట ,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సూళ్లూరుపేట సామంతమల్లం గ్రామంలో "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ - గ్రామీణ్ " పథకాన్ని ఎమ్మెల్యే డా. శ్రీమతి నెలవల విజయశ్రీ ప్రారంబించారు.సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట మండలం సామంతమల్లం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ - గ్రామీణ్' నూతన గ్రామీణ ఉపాధి పథకాన్ని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డా. శ్రీమతి నెలవల విజయశ్రీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం, గ్రామీణ కుటుంబాల జీవనోపాధిని బలోపేతం చేయడం, గ్రామాల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనతో పాటు "వికసిత్ భారత్--2047" లక్ష్య సాధనకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని అన్నారు.ఈ పథకం ద్వారా గ్రామీణ కార్మికులకు సంవత్సరానికి 125 రోజుల ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల ప్రకారం కూలీలకు



పారదర్శకంగా చెల్లింపులు జరుగుతాయని, బయోమెట్రిక్ హాజరు, జియోట్యాగింగ్ వంటి ఆధునిక సాంకేతిక విధానాల ద్వారా పనుల నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. వేతనాలు నిర్ణీత గడువులో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ఈ పథకం కేవలం ఉపాధి కల్పనకే పరిమితం కాకుండా గ్రామాల్లో చెరువులు, కాలువలు, రహదారులు, నీటి సంరక్షణ పనులు, పచ్చదనం పెంపు, ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల నిర్మాణానికి దోహదపడుతుందని ఎమ్మెల్యే వివరించారు.అనంతరం గ్రామంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి అర్హులైన కుటుంబానికి ఈ పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తూ ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందించేలా కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ‘జుకార్ట్ ’ సేవలను సద్వినియోగం చేసుకోండి

## - చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేల సూచన



**చిత్తూరు, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాకు చెందిన ఔత్సాహిక యువకుడు సురేంద్రయాదవ్ తొలిసారిగా చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న జుకార్ట్ ఆల్ ఇన్ వన్ డెలివరీ సర్వీసెస్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, డాక్టర్ కలికిరి మురళిమోహన్ సూచించారు. ఈ మేరకు స్థానిక పంత్రాంపల్లిలోని ప్రీతి రాయల్ పేరడైస్ లో నూతనంగా ఏర్పాటు చేసిన జుకార్ట్ కార్యాలయాన్ని సంబంధిత ఇరువురు ఎమ్మెల్యేలు గురువారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బాగా చదువుకొని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా తన స్వశక్తితో తాను ఎదుగుతూ... మరో పది మందికి ఉపాధి కల్పించేలా మంచి ఆలోచనతో సురేంద్రయాదవ్ జుకార్ట్ పేరుతో ఆల్ ఇన్ వన్ డెలివరీ సర్వీసెస్ సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. చిత్తూరు లాంటి నగరంలో అమెజాన్, ఫ్లిప్ కార్ట్ , ఈ - కార్ట్ లాంటి డెలివరీ సర్వీసెస్ సంస్థల స్థాయిలో జుకార్ట్ సంస్థను ఏర్పాటు చేసి సంబంధిత సంస్థల నుంచి పోటీని ఎదుర్కోవడం అంత ఆషామాషీ విషయం కాదన్నారు. అయినా ఔత్సాహిక సురేంద్రయాదవ్ పట్టువదలని విక్రమార్కుడిలా చిత్తూరు జిల్లా వాసులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ఓ డెలివరీ సంస్థను ఏర్పాటు చేసి వందల మందికి ఉపాధి కల్పించడం గొప్ప విషయంగా అభివర్ణించారు. జుకార్ట్ ఆల్ ఇన్ వన్ డెలివరీ సర్వీసెస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సురేంద్రయాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకతో పాటు తమిళనాడు రాష్ట్రాలలో తమ స్వదేశీ డెలివరీ సంస్థ ద్వారా ఆయా ప్రాంతాల వినియోగదారులకు సేవలు అందిస్తామన్నారు. ఇందుకు వినియోగదారులు తమకు పూర్తి సహకారాన్ని అందించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. కాగా ఈ కార్యక్రమంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ వసంత్ కుమార్, తవనంపల్లి కూటమి నాయకులు గోపి యాదవ్ లవ్ కుమార్ యాదవ్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్ టిడిపి నాయకులు సురేష్ నాయుడు, భవ్యచౌదరి, సురేష్ కుమార్ పాటు పలు రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వినియోగదారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల ఉపాధికి గొడ్డలి పెట్టు



**పెద్దపంజాణి ,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విబిజీ రాంజీ బిల్లు ఉపాధి హామీ కూలీల ఉపాధికి గొడ్డలి పెట్టని వ్యవసాయ కార్మిక సంఘం చిత్తూరు జిల్లా కార్యదర్శి హంగేరి ఓబులరాజు అన్నారు. ఈరోజు దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా పెద్దపంజాణి మండలం, పంజానీ సత్రం గ్రామంలో ఉపాధి హామీ-ాూాా గారికి వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి ప్రారంభం కాబోతున్న విబిజి రాంజీ బిల్లు ఉపాధి హామీ కూలీల ఉపాధి గ్యారెంటీ లేకుండా చేస్తుందని హెచ్చరించారు కేంద్రప్రభుత్వ నిర్ణయం కూలీలకు గొడ్డలి పెట్టు కాబోతుందని ఆయన తెలిపారు. రెండు పూట్ల పని చేయటం, రెండు ఆన్లైన్ మస్టర్ ఫోటోలు దిగటం అనేది గ్రామం నుండి దూర ప్రాంతంలో పనిచేసే ఉపాధి హామీ కూలీలకు ఖర్చుతో కూడుకున్న సమస్యగా మారిందని ఆయన తెలిపారు. రెండుసార్లుగా వెళ్లి రావటం వలన రానుపోను ఆటో ఖర్చులు రోజుకి 80 రూపాయల నుండి 120 రూపాయల వరకు ఉపాధి హామీ కూలీలు చేతి డబ్బులు పెట్టుకోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. అదేవిధంగా జియో టాక్ తో చేస్తున్న పనిని మరల మూడు సంవత్సరాలు వరకు పనిచేయడం కుదరదు అనే నిబంధన వలన కూలీలు చేయటానికి పనులు కూడా లేకుండా పోయే ప్రమాదం ఉన్నదని ఆయన అన్నారు. అదేవిధంగా పెంచిన ఉపాధి హామీ ఖర్చులో రాష్ట్ర ప్రభుత్వం వాటాను ఖాతాలో జమ చేస్తేనే కేంద్ర ప్రభుత్వ వాటాను జమ చేస్తుందనే నిబంధన వలన ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు అందని దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఈ విధంగా విపిజి రాంజీ బిల్లు అమలు చేయటం ద్వారా ఉపాధి హామీ కూలీలకు అవస్థలు పెరిగి తమంటమంతట తాము గానే ఈ పని చేయలేము అని మానుకోవలసిన దుస్థితిని తీసుకు వస్తారని దీనిని ఎదుర్కోవాలి అని అంటే ఆందోళన పోరాటాలే మార్గమని అందుకు వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధి హామీ కూలీలకు అండగా నిలబడుతుందని అన్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం 90 శాతం వాటాను కొనసాగిస్తూ రాష్ట్రానికి 10,500 కోట్ల రూపాయలు బడ్జెట్ ను కేటాయించాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, రెండు పూట్ల పని, రెండు ఫోటోలు ఎత్తివేయాలని, వేతనాన్ని 600 రూపాయలకు పెంచాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, మజ్జిగ,మంచినీళ్లు, పలుకు, పారా అందించాలని జరగబోయేటువంటి ఆందోళనలో ఉపాధి హామీ కూలీలు అందరూ కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు అమరనారాయణమండల కార్యదర్శి రాజన్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు తిప్పన్న వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సోమశేఖర్ రంగప్ప, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా రెడ్డి గౌని రెడ్డప్ప,సుబ్రహ్మణ్యం

**పుంగనూరు, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**జాతీయ బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా రెడ్డి గౌని రెడ్డప్ప అలాగే కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం లను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి షణ్ముగం గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఉత్తర్వు పత్రాలను అందించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరు మండలం దిగువపల్లి గ్రామం ఏటవాకిలి పంచాయతీ కి చెందిన రెడ్డి గౌని వెంకట రమణ గౌడు కుమారుడు రెడ్డప్ప, పుంగనూరు మండలం కే బత్తలాపురం గ్రామం నెక్కుంది పంచాయతీకి చెందిన రామలింగప్ప కుమారుడు ఎం సుబ్రహ్మణ్యం బీసీల పక్షాన నిలబడి బీసీల సమస్యలపై చేసిన పోరాటాలు అదేవిధంగా సేవలను గుర్తించి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు వీరిని నియమించినట్లు షణ్ముగం తెలిపారు. అన్నమయ్య జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులుగా నియమితులైన రెడ్డప్ప, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి తమను అన్నమయ్య జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా అలాగే కార్యదర్శిగా నియమించినందుకు వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణయ్యకు, జాతీయ ప్రధాన కార్యదర్శి షణ్ముగం కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తమకు ఈ పదవులు రావడానికి సహకరించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి హేమావతి అలాగే మా శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అన్నమయ్య జిల్లాలో బీసీ కులాల బలోపేతానికి బీసీలకు ఏ సమస్య వచ్చిన ఆ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని బీసీల రిజర్వేషన్ ఆధారంగా బీసీల కోసం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి షణ్ముగం నేతృత్వంలో అవసరమైన ఉద్యమాలు చేస్తామని తెలిపారు. త్వరలో జిల్లాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘాన్ని విస్తరించి బీసీలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా కార్యాలయం ప్రారంభిస్తామని రెడ్డప్ప, సుబ్రహ్మణ్యంలు తెలిపారు.

## జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పటిష్టంగా నిర్వహిస్తున్నాం

### - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

### - ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఈసీఐ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ



**మదనపల్లె,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధ్యక్షతన... రాష్ట్రంలోని జిల్లాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అమలు, పురోగతి, క్షేత్రస్థాయి చర్యలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవతో కలిసి జిల్లా ఎన్నికల అధికారు లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు మదనపల్లె కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి, ఎస్‌డీసీ మాధవ కృష్ణారెడ్డి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చేపడుతున్న చర్యలు, క్షేత్రస్థాయి పురోగతి, నమోదు మరియు పరిశీలన కార్యక్రమాలపై జిల్లా వారీగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్షించారు. ఓటరు జాబితాల ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి స్థాయిలో పరిశీలన, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్ల నమోదుకు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి లోపాలు లేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో 12,32,439 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 12,22,287 మంది ఓటర్లకు 99.18 శాతం మేర ఎలక్షన్ ఫార్మ్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేస్తున్నట్టు పేర్కొన్నారు. 4,74,804 మంది డిజిటలైజేషన్ ప్రక్రియ 38.53 శాతం పూర్తయ్యిందని, బుక్ ఏ బి. ఎల్.వో ద్వారా 3852 కాల్స్ మాట్లాడి పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, ఫారంల పంపిణీ, మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియ తదితర అంశాలలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ వివరించారు. ఈ వీసీలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణ మాసోత్సవాల గోడ పత్రికల ఆవిష్కరణ

**చిత్తూరు, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డెంగ్యూ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ చెప్పారు. నగరపాలక కార్యాలయంలో గురువారం డెంగీ నివారణ మహోత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డెంగీ నివారణ మహోత్సవాల్లో భాగంగా అన్ని ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని, పరిసరాల్లో శుభ్రంగా ఉంచుకొని, నిల్వ నీరు చేరకుండా చూడాలన్నారు. దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవగాహన పెంచి ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వికలాంగులకు,వృద్ధులకు ఇంటికెళ్ళి రేషన్ ఇవ్వాలి

**కడప అర్బన్ ,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వికలాంగులకు మంచాన పడ్డవారికి ఇంటికెళ్ళి రేషన్ ఇవ్వడం లేదని జె కె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాప కులు లయన్ పటాన్ ఖాదర్ భాషా అన్నారు. ఈ విషయం పై తాసిల్దార్ కు ఫిర్యాదు చేశామని చెప్పారు. గౌస్ నగర్ లో ఉండే 53 రేషన్ షాపు డీలర్ వికలాంగులకు మంచాన పడ్డ వారికి ఇంటివద్దకు పోయి రేషన్ ఇవ్వడం లేదని ఆరోపించారు. గురువారం జె కె తన మిత్రబృందంతో కలిసి విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెల రేషన్ డీలర్ వికలాంగులకు మంచాన పడ్డవారికి ఇంటివద్దే రేషన్ ఇవ్వాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయని తెలిపారు కానీ డీలర్ ఇవ్వకుండా రేపు రా మన్నాడు రా అని తిప్పుకుంటూ ఉన్నాడని స్థానిక ప్రజల ఆవేద వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని తాము తహసిల్దార్ దృష్టికి తీసుకుని పోయి వారి సమస్యను పరిష్కరించాలని తాసిల్దార్ ను కోరారు. ఇందులో ముస్లిం యునైటెడ్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి రఫీ ఖాన్ మహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## కిండర్ కేర్ సెంటర్‌లో అన్నదానం



**పలమనేరు,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**పట్టణ సమీపంలోని కిండర్ కేర్ సెంటర్ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు పలమనేరు శాసనసభ్యులు ఎన్ అమర్నాథరెడ్డి జన్మదిన సందర్భంగా పిల్లలకు భోజనాన్ని మైనార్టీ నాయకుడు సయ్యద్ నూర్ భాషా ఆధ్వర్యంలో పిల్లల మధ్య భారీ కేక్ ను కట్ చేసి పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు బాలింతలకు బ్రెడ్డు పండ్లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగరాజ్ ఆధ్వర్యంలో మహిళలకు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్ రెండెంట్ మమతా రాణి,మైనార్టీ నాయకుడు సయ్యద్ నూర్ భాషా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగరాజ్, డాక్టర్ యుగంధర్, సుధాకర్,భాస్కర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కంఠ పోరులో కడపకు అండర్-16 సౌత్ జోన్ టైటిల్

### సారిక్, తనీస్వర్ సెంచరీలు వృథా... రన్నరప్‌గా చిత్తూరు

**వాయల్పాడు, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాయల్పాడులోని సీడీసీఏ--జీవీఎస్‌సీఎస్ గ్రౌండ్స్‌లో జరిగిన సౌత్ జోన్ అండర్-16 మల్టీ డేస్ టోర్నీ ఫైనల్ తరహా మ్యాచ్‌లో కడప జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. చివరి ఇన్నింగ్స్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో చిత్తూరు జట్టు చివరి వరకు విజయం కోసం పోరాడినా స్వల్ప తేడాతో ఓటమి చవిచూసి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు 71.5 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌట్ అయింది. కె. లోకేష్ (67), ఎస్.కె. ఉమర్ సిద్ధిక్ (59), పి. హితేష్ సాయి (65 నాటౌట్) రాణించారు. చిత్తూరు బౌలర్లలో రైట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ జయప్రకాశ్ 93 పరుగులకు 5 వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను కుదేలు చేయగా, తేజేష్, దినేష్ తలో రెండు వికెట్లు సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 35 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయింది. వి.జె. నోయెల్ (45) మాత్రమే ప్రతిఘటించాడు. కడప బౌలర్లలో ఎమ్. వర్షిత్ కుమార్, పి. హితేష్ సాయి చెరో నాలుగు వికెట్లు తీసి ఆధిక్యం అందించారు. 172 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 64.3 ఓవర్లలో 222 పరుగులకు ఆలౌట్ అయింది. కె. లోకేష్ (50), పి. అస్మాన్ ఖాన్ (46), యువ్.వి. శివచరణ్ (37), ఎ. సాయి అభినివేష్ (31) పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లలో దినేష్ 4/48, జయప్రకాశ్ 3/58తో మరోసారి రాణించారు. 394 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టుకు మహమ్మద్ సారిక్ అక్తర్ (131), తనీస్వర్ టెండూల్కర్ (111) అద్భుత సెంచరీలతో విజయాశలు రేకెత్తించారు.



# చిత్తూరు జిల్లా

## ప్రమాదం జరిగితే గాని స్పందించరా సారు



**రామకుప్పం , జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆపదలో ఉన్న తన సమస్య పరిష్కరించాలని తద్వారా తన ఇంటిని తన కుటుంబాన్ని భయాందోళన లేకుండా జీవించడానికి సహాయం చేయాలని బాధిత రైతు జిల్లా అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించుకున్న ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు ఇక వివరాలులోకెళితే రామకుప్పం మండలం రామకుప్పం పంచాయతీ పరిధిలోని తిమ్మసముద్రం కాలనీలో నివసిస్తున్న వెంకటేష్ కుటుంబం గ్రామ చివరలో కాపురం ఉంటున్నారు ఇంటి సమీపంలో ఉన్న ఓ పెద్దమాను ప్రమాదకర స్థితికి చేరుకుని నేడో రేపో ఇంటి మీద కూలిపోయే లా ఉందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కుప్పం కడా అధికారులకు ఇదివరకు ఐదు సార్లు పిజిఆర్ఎస్ ద్వారా సమర్పించిన స్వయాన కడ పిడి గారు కూడా ఈ విషయాన్ని పరిష్కరించాలని ఆదేశాలిచ్చిన ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా ప్రమాదం జరగకముందైన సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

## 5న కళామందిరం వార్షికోత్సవం

**పలమనేరు,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**గంగవరం మండలంలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరం నాల్గవ వార్షికోత్సవాన్ని ఈనెల 5వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి. తులసినాథం నాయుడు,పుష్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరచిన వివిధ రాష్ట్రాలకు చెందిన 50 మంది విద్యార్థులకు బహుమతులను అందిస్తామన్నారు. డాక్టర్ రజని మరియు వారి శిష్య బృందం చే కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. తెలుగు భాష మరియు సాహిత్య అభిమానులు అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

## పండుగ వాతావరణాన్ని తలపించిన ఎమ్మెల్యే అమర్ జన్మదిన వేడుకలు

### - సేవా కార్యక్రమాలతో అభిమానాన్ని చాటుకున్న నాయకులు, కార్యకర్తలు



**పలమనేరు,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పండుగ వాతావరణం ఉట్టిపడింది. ప్రతి ఊరిలోనూ బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదేవిధంగా పల్లె పల్లెలో భారీ కేక్‌లను కట్ చేసి, బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ మహిళలకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పట్టణ నాయకుల ఆధ్వర్యంలో మదనపల్లి రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న ఉపాధి కూలీలతో కలసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి నాయకత్వంలో పలమనేరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రజల మనిషిగా, నిరంతరం ప్రజా సేవలో ఉండే తమ నాయకుడి వేడుకలను ఇలా సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ నాయకుడికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు. అలాగే అమర్నాథ్ రెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై కంటైనర్ లారీ బోల్తా



**పలమనేరు,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**బెంగుళూరు చెన్నై జాతీయ రహదారి, గంటావూరు ఫ్లై ఓవర్ దగ్గర గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు నుండి తిరుపతి వైపు వెళ్తున్న కారును కంటైనర్ లారీ ఓవర్టేక్ చేసే క్రమంలో బోల్తా పడింది. ఈ ప్రమాదానికి కంటైనర్ డ్రైవర్ అతివేగంగా నడపడమే కారణమని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ప్రాణం నష్టం వాటిల్ల లేదు. కంటైనర్ లారీ కారును కొంత దూరం లాక్కెళ్ళినట్లు స్థానికులు చెప్తున్నారు. కంటైనర్ డ్రైవర్ మద్యం సేవించాడని అనుమానాలవ్యక్తమవుతున్నాయి. పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## ప్రజా చైతన్యంతో డెంగ్యూ మలేరియా నివారిద్దాం

### - డాక్టర్ పూజిత, డాక్టర్ సాయి శ్రీ

**రామకుప్పం ,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డెంగ్యూ మరియు మలేరియా వంటి మహమ్మారి వ్యాధులు ప్రబలకుండా మానవహారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నట్లు విజాలాపురం పీహెచ్సీ వైద్యాధికారులు పూజిత సాయిశ్రీ లు పేర్కొన్నారు. గురువారం ఆనిగానూరు గ్రామంలో విద్యార్థులు గ్రామస్తులచే డెంగ్యూ వ్యతిరేకమహోత్సవ సందర్భంగా ర్యాలీ మానవహారం నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు, అదేవిధంగా పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ప్రతిరోజు సాయంత్రం వేపాకు పొగ వేయాలన్నారు, డెంగు టైగర్ దోమను నివారించకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఏ బాలు, ఎం ఎల్ హెచ్ పి పుష్ప, ఏఎన్ఎం గ్లోరీ పంచాయతీ సెక్రెటరీ రాఘవరెడ్డి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని గ్రామ పంచాయతీలలో విబిజి రామ్‌జి పథకం ప్రారంభం



**పెద్దపంజాణి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం స్థానంలో కొత్తగా వచ్చిన వి బి జి రామ్ జి పథకాన్ని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈరోజు లాంచనంగా ప్రారంభించడం జరిగిందని ఎంపీడీవో బాలాజీ తెలిపారు ఈ పథకం ద్వారా 100 రోజుల గ్యారంటీ పనిని 125 రోజులకు పెంచడం జరిగినది .వ్యవసాయం ముమ్మరంగా జరిగే నెలలలో 60 రోజులపాటు పనికి విరామం ప్రకటించడం జరుగుతుంది నిర్ణీత సమయంలో వేతనాలు చెల్లింపులు చెల్లింపుల్లో జాప్యం జరిగినచో 0.05% జాప్య పరిహార చెల్లించడం జరుగుతుంది. వికసత్ గ్రామపంచాయతీ ప్రణాళిక లో అన్ని పథకాల అనుసంధానం చేయడం జరుగుతుందని ఎంపీడీవో మరియు ఏపీవో తెలిపారు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి ఏ పీ ఓ మురుగేషన్ జేఈ సుబ్రహ్మణ్యం సాంకేతిక సహాయకులు క్షేత్ర సహాయకులు గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు ప్రజా ప్రతినిధులు వి బి జి రామ్ జి వేతనదారులు రైతులు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విబీజీ రామ్‌జీతో గ్రామీణాభివృద్ధి పనులకు మరింత ఊతం

**- కాలువల పునరుద్ధరణతో రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం : జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**చింతపర్తి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామీణ ప్రాంతాల్లో సహజ వనరుల అభివృద్ధి, రైతులకు సాగునీటి సౌకర్యాల కల్పన, ఉపాధి హామీ పనులను మరింత విస్తృతంగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన విబీజీ రామ్‌జీ కార్యక్రమంలో భాగంగా పీలేరు నియోజకవర్గం లోని వాయల్పాడు మండలం, తాటి గుంట పల్లి వద్ద నిర్వహించిన సప్లై ఛానల్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు.అనంతరం బహుద నది నీరు వృధా కాకుండా తాటిచెరువు కు మళ్లింపు కటువ కాలువ పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత, ఉపాధి హామీ కూలీల భాగస్వామ్యంపై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కాలువ పనులు 08-06-2026న ప్రారంభమయ్యా యి.ఈ పనులకు మొత్తం రూ.3,09,509 అంచనా వ్యయం కాగా, మొత్తం 1,500 మీటర్ల పొడవులో చేపడుతున్న పనుల్లో ఇప్పటికే 800 మీటర్ల మేర పూర్తి కాగా, మిగిలిన 700 మీటర్ల పనులను నేడు ప్రారంభమైన విబీజీ రామ్‌జీ కార్యక్రమం ద్వారా పూర్తి చేయనున్నారు. ఈ పనుల ద్వారా సుమారు 1,000 మానవ దినాలు కల్పించబడనున్నాయి.కాలువ పునరుద్ధరణ పూర్తయి నీటి ప్రవాహం అందుబాటులోకి వస్తే సుమారు 300 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందడంతో పాటు 130 మంది రైతులు, 98 బోరు బావులు ప్రత్యక్షంగా ప్రయోజనం పొందనున్నాయని అధికారులు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఉపాధి హామీ పథకం అమలుపై గ్రామస్తులతో మాట్లాడారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీల అవసరం ఎక్కువగా ఉండే నేపథ్యంలో ప్రతి సంవత్సరం పంటల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రెండు నెలల పాటు ఉపాధి హామీ పనులకు విరామం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆ సమయంలో కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లే అవకాశం ఉంటుందని, మిగిలిన 125 రోజుల పాటు ఉపాధి హామీ పనులు కొనసాగుతాయని వివరించారు. ఈ విధానం రైతులు, వ్యవసాయ కూలీలు ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.గ్రామంలో ఉపాధి హామీ పనుల అమలు, కార్మికుల భాగస్వామ్యం, పని దినాల నమోదు, వేతనాల చెల్లింపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. గ్రామంలో నాలుగు ఉపాధి హామీ బృందాలు పనిచేస్తున్నాయని, అన్ని బృందాల్లో కార్మికులు చురుకుగా పాల్గొంటున్నారని సిబ్బంది తెలిపారు. పనుల కొలతలు పారదర్శకంగా నమోదు చేస్తున్నారా, వేతనాల్లో ఎలాంటి కోతలు లేకుండా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా, చెల్లింపుల సమాచారం సందేశాల ద్వారా అందుతున్నదా అనే అంశాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వేతనాలు క్రమం తప్పకుండా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని, సందేశాలు కూడా అందుతున్నాయని కార్మికులు తెలిపారు.ఉపాధి హామీ పనిదినాలను 125 రోజులకు పెంచిన నిర్ణయంపై కార్మికుల అభిప్రాయాన్ని జిల్లా కలెక్టర్ తెలుసుకోగా, పనిదినాలు తమకు సరిపోతున్నాయని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సంతృప్తిగా ఉన్నామని వారు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి హామీ పనులు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు రైతులకు శాశ్వత ప్రయోజనాలు చేకూర్చే విధంగా ఉండాలని అన్నారు. ప్రతి పనిని నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు సత్వర ప్రయోజనం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పనులన్నీ పూర్తి అయితే వ్యవసాయ ఉత్పాదకత పెరగడంతో పాటు భూగర్భ జలాల మట్టం కూడా మెరుగుపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన విబీజీ రామ్‌జీ కార్యక్రమంలో భాగంగా బహుద నది నుండి తాటిగుంటపల్లి చెరువు వద్ద చేపడుతున్న సప్లై ఛానల్ జిల్లా కలెక్టర్ పూజలు చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డి ఎల్ డి వో లక్ష్మీపతి, తాసిల్దార్ పామిలేటి, జూనియర్ ఇంజనీర్ మనోహర్, ఏపీవో మురళి సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, రైతులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## గ్రామ సచివాలయంలో సర్ పురోగతిపై సమీక్ష

**- చింతపర్తిలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్‌ని వీక్షించిన జిల్లా కలెక్టర్**



**వాల్మీకిపురం , జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "VB-G RAM (గ్రామీణ్) వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్" కార్యక్రమాన్ని గురువారం దేశవ్యాప్తంగా ప్రారంభించింది. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా ఒబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రారంభించగా, చింతపర్తి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొని ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గత రెండు దశాబ్దాలుగా ఉపాధి హామీ పథకం గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. కొత్త పథకంలో పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం ద్వారా గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బీఎల్వోలతో సమావేశమై, ఇప్పటివరకు నమోదైన సర్ పురోగతిని సమీక్షించారు.సర్ డిజిటలైజేషన్ శాతాన్ని మరింత పెంచి కనీసం 50 శాతం పురోగతి సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా-2002 ఆధారంగా పరిశీలన చేపడుతున్న సమయంలో కొన్ని రికార్డులు అందుబాటులో లేకపోవడం అధికారుల దృష్టికి తీసుకురాగా, ఆ అంశాన్ని నమోదు చేసి భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.'నో మ్యాపింగ్' మరియు ఇతర అనామలీస్ సంఖ్యను గణనీయంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఓటరిని గుర్తించి సంబంధిత వివరాలను సరిచేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గతంలో సర్ మ్యాపింగ్ శాతం తక్కువగా ఉండడానికి గల కారణాలను ఆరా తీసిన కలెక్టర్, ప్రస్తుతం పురోగతి మెరుగుపడుతున్నప్పటికీ మరింత వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎపిఐఐసి కు సంబంధించిన భూమి లభ్యతపై కూడా జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న భూముల వివరాలను అధికారులు స్కెచ్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో డి ఎల్ డి వో లక్ష్మీపతి, తాసిల్దార్ పామిలేటి, బి ఎల్ వో లు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, రైతులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీకి మరోసారి జాతీయస్థాయిలో గుర్తింపు

**- ఇండియా టు డే ఉత్తమ విద్యాసంస్థల జాబితాలో చోటు**

**- యూనివర్సిటీ ఛాన్సలర్ విజయభాస్కర్ చౌదరి హర్షం**



**మదనపల్లె/ కురబలకోట,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ మరో ప్రతిష్టాత్మక గౌరవాన్ని దక్కించుకుంది.దేశంలోని ప్రముఖ విద్యా సంస్థలపై నిర్వహించిన ఇండియా టుడే బెస్ట్ కాలేజెస్ - 2026లో మిట్స్ విశిష్ట స్థానం సంపాదించిందని యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు.ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో ప్రభుత్వ,ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలను కలిపి నిర్వహించిన ర్యాంకింగ్స్‌లో మిట్స్ దేశవ్యాప్తంగా 187వ ర్యాంకును సాధించగా,ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల విభాగంలో దేశవ్యాప్తంగా 155వ ర్యాంకును కైవసం చేసుకుందన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి గుర్తింపు మిట్స్‌లో అందిస్తున్న నాణ్యమైన విద్య,అత్యాధునిక ప్రయోగశాలలు,పరిశోధనకు ప్రాధాన్యత,పరిశ్రమలతో అనుసంధానమైన బోధన,ప్రతిభావంతులైన అధ్యాపక బృందం మరియు ఉత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలకు నిదర్శనమని తెలిపారు.ప్రస్తుతం 2026-27 విద్యా సంవత్సరానికి బీటెక్, ఎం.టెక్,బీబీఏ,బీసీఏ, ఎంబీఏ,ఎంసీఏ మరియు పీహెచ్.డి. కోర్సులలో ప్రవేశాలు కొనసాగుతున్నాయన్నారు.దీనిపై ఛాన్సులర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి స్పందిస్తూ సాంకేతిక విద్యలో మిట్స్ యూనివర్సిటీ అత్యున్నత ప్రమాణాలను అవలంబిస్తోందన్నారు.కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ బంగారు భవిష్యత్తును మిట్స్‌తో నిర్మించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# తల్లికి వందనం నిధులు విడుదల

**-జిల్లా సంక్షేమ, సాధికారిత అధికారి సి. దామోదర్ రెడ్డి వెల్లడి**

**మదనపల్లె,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 2026-27వ సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 16న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతూ అర్హత కలిగిన షెడ్యూల్ కుల విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద నిధులు మంజూరి చేయడం జరిగిందని జిల్లా షె.కు సంక్షేమ మరియు సాధికారిత అధికారి సి. దామోదర్ రెడ్డి ఓ.. ప్రకటనలో తెలిపారు. ఇందులో విద్యార్థులు తప్పనిసరిగా. వారి పేరు మీద యూనియన్ బ్యాంక్ లేదా స్టేట్ బ్యాంక్ ల్లో నూతన బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని సూచించారు. అలాగే పై తెలిపిన కొత్త ఖాతాను ఎన్.పి.సి.ఐ. లింక్ చేయించుకోవడం ద్వారా మాత్రమే తల్లికి వందనము పథకం ప్రయోజనాలు అందజేయడం జరుగుతుందన్నారు. అందువల్ల ఈ నెల 9 వ తేది లోపు కొత్త ఖాతా ను ఓపెన్ చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల పేరు మీద నూతన అకౌంట్ తెరిచే విధంగా కళాశాల యాజమా న్యాలు, స్వర్ణ గ్రామం మరియు స్వర్ణ వార్డు సచివాలయం సిబ్బంది కి ఆదేశాలు జారీ చేశారు.

# ఉపాధిహామీకి పేరుమార్పు మహాత్ముడిని అవమానపరచడమే

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రెడ్డి సాహెబ్ ఆగ్రహం**



**మదనపల్లె, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉపాధి హామీ పథకం పేరుమార్పు మహాత్మా గాంధీని అవమాన పరచడమేనని, ఆయన ప్రాముఖ్యతను మరుగున పడేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ తీవ్రంగా ఆరోపించారు. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న (ఎం జి ఎ న్ ఆ ర్ ఈ జీ ఏ) మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ పేరు తుడిచిపెట్టి మహాత్మా గాంధీ పేరు వినిపించకుండా ఏపీలోని తిరుపతి జిల్లా,రైల్వే కోడూరు నియోజకవర్గం,ముక్కావారిపల్లిలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకుని వచ్చిన వీబీజి రామ్ జీ (వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్) కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్,సిఎం చంద్రబాబునాయుడు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రారంభించడమని ఆయన అభివర్ణించారు. గురువారం మదనపల్లె కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేఖరుల సమావేశంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆయన మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ పేరును తొలగించడం ద్వారా దేశప్రజల హృదయాల నుంచి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఆయన సిద్ధాంతాలను చెరిపి వేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన విప్లవాత్మక ఉపాధి చట్టం నుండి గాంధీ పేరును తొలగించడం,జాతిపితకు చేసిన అవమానంగా అభివర్ణించాయి.రాజకీయ దురుద్దేశ్యంతోనే పథకం పేరును వీబీజీ రామ్ జీ (వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్)గా మార్చారని విమర్శించాయి.ఇందులో భాగంగానే పాత చట్టాన్ని రద్దు చేసి పనిదినాలను 100 నుండి కేవలం 125 రోజులకు పెంచి కొత్తచట్టాన్ని తీసుకువచ్చిన ఉపాధి కూలీలకు ఒరిగిందేమీ లేదన్నారు.కూలీలకు దక్షిణ భారతదేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కవిధంగా దినసరి కూలీలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భాగస్వామ్యంగా వున్న ఎన్‌డీయే ప్రభుత్వంలో అతితక్కువ దినసరి కూలీ ఉండటం దురదృష్టకర మన్నారు.కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో పాలన వున్న టిడిపి,జనసేన పార్టీలు ఎక్కువ కూలీ తీసుకుని రావడంలో వైఫల్యం చెందారని విమర్శలు గుప్పించారు.కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని స్థితిలో జనసేన,టిడిపి ఉన్నాయని ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీల రేట్లను పెంచి ఆదుకోవాలన్నారు.

# తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

**- మునిసిపల్ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే షాజహాన్ భాష**



**మదనపల్లె, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే షాజహాన్ భాష మునిసిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించేందుకు మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో కలిసి పలు ప్రాంతాలలో బోర్లు వేసేందుకు అనవైన ప్రదేశాలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడైనా మునిసిపల్ బోర్లు నిరూప యోగంగా ఉంటే వినియోగంలోకి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా మున్సిపల్ వాటర్ సప్లై సిబ్బంది, స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పెద్ద తోపు, బహుద కాలువ పరివాహ ప్రాంతంలో బోర్లు వేసేందుకు అనువైన ప్రాంతాలుగా గుర్తించారు. యుద్ధ ప్రాతిపదికన, బోర్లు వేయడంతో పాటు మోటార్లు బిగించి ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డి ఈ శ్రావణి, టిడిపి నాయకులు నవీన్ చౌదరి, తాళ్ల గిరి, ఏ.ఎస్.ఆర్ రాజా, జెసిబి వేణు, పలువు నేతలు పాల్గొన్నారు.

# మదనపల్లె ప్రాంత అభివృద్ధికి సహకారం అందించండి

**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బిజెపి నేత చల్లపల్లె నరసింహా రెడ్డి వినతి**



**మదనపల్లె,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జాతీయ గీతం రచించబడిన మదనపల్లె ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి మదనపల్లె పట్టణానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె భారత చరిత్రలో ఒక విశిష్ట స్థానం కలిగిన పట్టణమని,రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జన గణ మన జాతీయ గీతాన్ని ఆయన స్వయంగా ఆంగ్లంలోకి అనువదించి,దానికి స్వరరూపం ఇచ్చిన చారిత్రక ప్రదేశంగా మదనపల్లె ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు.ఈ అపూర్వ వారసత్వం దేశానికి గర్వకారణమని,అయితే ఇంతటి చారిత్రక ప్రాధాన్యం ఉన్నప్పటికీ మదనపల్లెకు తగిన స్థాయిలో అభివృద్ధి,పర్యాటక ప్రోత్సాహం మరియు జాతీయ గుర్తింపు లభించలేదన్నారు.అందువల్ల ఈ అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు.అదేవిధంగా మదనపల్లెను జాతీయ వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని,జాతీయ గీత చరిత్రను ప్రతిబింబించే స్మారక భవనం,మ్యూజియం మరియు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.రవీంద్రనాథ్ ఠాగూర్‌కు సంబంధించిన చారిత్రక ప్రాంతాలను సంరక్షించి అభివృద్ధి చేయాలని రహదారులు,రైల్వే,పర్యాటక వసతులు మరియు ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలన్నారు.ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి మదనపల్లెకు విశేష గుర్తింపు తీసుకురావాలని,దేశచరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ఈ పవిత్ర ప్రాంత అభివృద్ధికి మీ నాయకత్వంలో ప్రత్యేక నిధులు కేటాయించి తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డాక్టర్ అజ్మతుల్లా ఖాన్,బైసాని రమేష్,బండి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనం ప్రారంభం

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి - హాజరైన డాక్టర్ మునిగోపాలకృష్ణ**

**మదనపల్లె,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ నూతన భవనాన్ని విజయవాడలో రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగిందని మదనపల్లె ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ తెలిపారు.గురువారం రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి,రాష్ట్ర సెక్రటరీ జనరల్ లవకుమార్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ గురు రాజారావు,రాష్ట్ర ఉపాధ్యక్షులు జయరాం నాయుడు,మదనపల్లె ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ,తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య,వాల్మీకిపురం అధ్యక్షులు శంకరలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆల్ఫ్రెడ్,ఢిల్లీ సుధాకర్ రెడ్డి,మాజీ ప్రధాన కార్యదర్శి ఢిల్లీ పూర్ణచంద్ర రావు,ఆత్మీయ విశిష్ట అతిథి ఏపీజెఎసి చైర్మన్ అమరావతి బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరయ్యారన్నారు.ఎపి రాష్ట్ర సంఘం నూతనంగా నిర్మించుకున్న సమావేశ మందిరంలో ప్రథమంగా ఆత్మీయ సదస్సును ఏర్పాటు చేశారని,ఇందులో మదనపల్లె నుండి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణను రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి కండువాతో సత్కరించి రాష్ట్ర పతాకాన్ని చేతికి అందించారని,మదనపల్లె అన్నమయ్య జిల్లా తరపన రాష్ట్ర అధ్యక్షులు,వారి సతీమణిని డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ పూలమాల పుష్పగుచ్ఛముతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరూ ఏకతాటిపైకి వచ్చి ఐకమత్యంతో సంఘీభావం తెలిపి సమస్యలపై పోరాటం చేయవలసిన అవసరం ఏర్పడిందని స్పష్టం చేశారు.పెన్షన్ అనేది సుప్రీం కోర్టు మనకు ప్రసాదించిన హక్కు అని చెప్పారు.అసోసియేట్ ప్రెసిడెంట్ గురు రాజారావు మాట్లాడుతూ పోరాడితే పోయేది బానిస సంకెళ్లేనని ప్రసంగించారు.

# పీలేరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

**- అధ్యక్షుడుగా చింతల విజయ భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చిచ్చిలి సురేంద్ర రెడ్డి**



**పీలేరు,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు నూతన కార్యవర్గం జూలై 1వ తేదీ నుంచి ఒక సంవత్సరం కాలానికి అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది. సమాజ సేవను మరింత విస్తృత స్థాయిలో ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో నూతన బృందం సేవా కార్యక్రమా లను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. నూతన కార్యవర్గంలో సి.ఎన్.ఆర్. విద్యాసంస్థల అధినేత చింతల విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షుడిగా, ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిచ్చిలి సురేంద్ర రెడ్డి ప్రధాన కార్యదర్శిగా , గుంటూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పదవీ విరమణ పొందిన పి.వి. రమణ కోశాధికారిగా ఎన్నికై బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవర్గానికి క్లబ్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చింతల విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత ప్రజలకు చేరువ చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. గత కార్యవర్గాలు చేపట్టిన సేవా కార్యక్రమాలకు కొనసాగింపుగా, సమాజ అవసరాలకు అనుగుణంగా కొత్త కార్యక్రమాలను కూడా ప్రవేశపెడతా మని చెప్పారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యా అవగాహన కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణలు, కెరీర్ మార్గదర్శకత్వ సదస్సులు, నైపుణ్యాభివృద్ధి శిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు. యువతలో సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ప్రేరణాత్మక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఆరోగ్య రంగంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు, నేత్ర పరీక్షలు, నేత్ర శస్త్రచికిత్స లకు సహాయం, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు వైద్య సహాయం అందేలా క్లబ్ తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విస్తృత స్థాయిలో మొక్కల నాటకం, వాటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజంలో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకువిద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని అన్నారు. అదేవిధంగా పీలేరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యంగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న పేద రోగులకు సహాయ సహకారాలు అందించడం తమ కార్యవర్గం తొలి ప్రాధాన్యతగా ఉంటుందని విజయ భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన వారికి డయాలసిస్ చికిత్స, వైద్య సలహాలు, ఆర్థిక సహాయం అందించే దిశగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, సేవా స్ఫూర్తిని బలోపేతం చేయడానికి నూతన కార్యవర్గం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ఆయన తెలిపారు. సేవే పరమావధిగా ప్రతి సభ్యుడు అంకితభావంతో పనిచేస్తారని పేర్కొన్నారు. క్లబ్‌సభ్యులు నూతన అధ్యక్షుడు చింతల విజయ భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిచ్చిలి సురేంద్ర రెడ్డి, కోశాధికారి పి.వి. రమణతో పాటు నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారి నాయకత్వంలో పీలేరు ప్రాంతంలో మరిన్ని ప్రజోపయోగ, సేవా కార్యక్రమాలు విజయవంతంగా అమలై, లయన్స్ క్లబ్ సేవా సంప్రదాయాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలుగు రాష్ట్రాలకు చల్లని కబురు

### : జూలై 8 వరకు విస్తారంగా భారీ వర్షాలు!



**విజయవాడ జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారడంతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో జూలై 8 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఒడిశా -- పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని జూలై 3న అల్పపీడనం ఏర్పడనుందని, ఇది క్రమంగా రాజస్థాన్ వైపు పయనిస్తుందని అధికారులు తెలిపారు.దీని ప్రభావంతో జూలై 4 నుంచి వర్షాల తీవ్రత పెరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తా, శ్రీకాకుళం, మన్యం, అల్లూరి జిల్లాలతో పాటు, తెలంగాణలోని ఆదిలాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం తదితర ఉత్తర, తూర్పు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. వర్షాల నేపథ్యంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఆశ్రయం పొందరాదని విపత్తు నిర్వహణ శాఖ ప్రజలను హెచ్చరించింది. పక్షం రోజులుగా వరుణుడి కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు ఈ వర్షాలు ఊరటనివ్వనున్నాయి.

## వీబీజీరామ్‌జీ పథకంలో పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**వీరఘట్టం జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్ – గ్రామీణ్ (వీబీజీరామ్‌జీ)' పథకంలో భాగంగా పనులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 125 రోజులు పనిదినాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. జల సంరక్షణ, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు చేపడతారన్నారు. పంటలపై ఎల్‌నినో ప్రభావం చూపుతుందన్నారు. వాణిజ్య పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.వెంకటరమణ, ఏపీవో సత్యంనాయుడు, నాయకులు ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఆత్మహత్యల నివారణకు అవగాహనే ఆయుధం

### -- 'నో సూసైడ్' మాసోత్సవాల పై అవగాహనా సదస్సు"



**శ్రీకాకుళం జిల్లా జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ గౌరవ సెక్రటరీ గారి ఆదేశాల మేరకు, ఆత్మహత్యల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జూన్ 15 నుండి జూలై 15 వరకు నెల రోజుల పాటు 'నో సూసైడ్' మాసోత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం నాడు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ శ్రీకాకుళం జిల్లా వారి ఆధ్వర్యంలో చల్లపేట జెడ్ పి హై స్కూల్ నందు వన్ స్టాప్ సెంటర్ వారు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వన్ స్టాప్ సెంటర్ వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్న రాణి 'నో సూసైడ్', 'మానస్ వికాస్' కార్యక్రమాల ఉద్దేశ్యాలను వివరించడంతో పాటు, మానసిక ఆరోగ్య పరిరక్షణ, ఒత్తిడి నిర్వహణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడం వంటి అంశాలపై పాల్గొన్న వారికి విస్తృత అవగాహన కల్పించారు. అలాగే మానసిక ఆరోగ్య సహాయానికి సంబంధించిన 14416 హెల్ప్‌లైన్, మహిళల సహాయార్థం 181 ఉమెన్ హెల్ప్‌లైన్, పిల్లల రక్షణ కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, అత్యవసర సేవల కోసం 112 పోలీస్ హెల్ప్‌లైన్ సేవల గురించి వివరించారు. వన్ స్టాప్ సెంటర్, ఐసీపీఎస్ మరియు ఇతర శాఖల ద్వారా అందిస్తున్న సేవలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీపీఎస్ సిబ్బంది జనార్ధన్, పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల దేవి మరియు ఇతర బోధన సిబ్బంది, విద్యార్థులు, బ్రెడ్స్ మాధవి, చైల్డ్ లైన్ వైకుంఠ రావు పాల్గొన్నారు.

## జగన్ 'మావిగన్' నినాదంపై మంత్రి కొల్లు రవీంద్ర విమర్శలు




**మచిలీపట్నం ప్రతినిది జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన "జగన్ మావిగన్" నినాదంపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మచిలీపట్నంలో నిర్వహించిన భారత్ వికాస్ జీ రాం జీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి కొల్లు రవీంద్ర, జగన్‌కు నిలకడలేని మనస్తత్వం ఉందని ఆరోపించారు. 2019 ఎన్నికలకు ముందు అమరావతే రాజధాని అని ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. అందుకే ప్రజలు వైఎస్సార్‌సీపీని 11 అసెంబ్లీ స్థానాలకు పరిమితం చేశారని పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత అయినా జగన్‌లో మార్పు వస్తుందని ఆశించామని, అయితే గత రెండేళ్లలో ఆయన తీరు మరింత ఆందోళనకరంగా మారిందని అన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులను గతంలో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించిన మంత్రి, ఇటీవల అమరావతి పరిరక్షణ సమితి పేరుతో రౌడీలను పంపించారని, ఇప్పుడు "అమరావతి కాదు… మావిగన్ మా నినాదం" అంటూ కొత్త వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. మూడు రాజధానుల ప్రతిపాదనతో గతంలో రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేశారని, ఇప్పుడు "మావిగన్" వంటి వ్యాఖ్యలతో మళ్లీ పెట్టుబడులను అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలిగించే ఇటువంటి వ్యాఖ్యలను ప్రజలు ప్రశ్నించాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

## అంగన్వాడీ కేంద్రానికి వాటర్ ఫిల్టర్ వితరణ - చనయోలు నారాయణ



**ఇబ్రహీంపట్నం, జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు అంటూ ఇబ్రహీంపట్నం 14వ వార్డు పరిధిలోని అంగన్వాడీ కేంద్రానికి టీడీపీ సీనియర్ నాయకులు 13వ వార్డు కౌన్సిలర్, క్లస్టర్ 009 ఇంచార్జి చనమోలు నారాయణ వాటర్ ఫిల్టర్ ను వితరణ చేశారు. అంగన్వాడీకి వచ్చే చిన్నారులు సురక్షితమైన తాగునీరు తాగేలా చూడాలనే ఉద్దేశంతో ఫిల్టర్ ను అందజేశారు. అదేవిధంగా చిన్నారులకు స్లేట్లు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చనమోలు నారాయణ మాట్లాడుతూ,తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యంగా పిల్లలు, మహిళల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నంబూరి ప్రదీప్, 208 బూత్ ఇంచార్జి నల్లమోతు గిరీష్,కె బాబురావు, కోటేశ్వరరావు,స్థానిక నాయకులు,అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వీబీజీ రామ్‌జీతో కార్మికులకు మరింత భరోసా

### -మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు .

### చెవుటూరులో వీబీజీ రామ్‌జీ పనులకు శ్రీకారం.

**ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు, జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించి, కార్మికులకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) -- వీబీజీ రామ్‌జీ పనులను జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఐ.ఏ.ఎస్ గారితో కలసి, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు కార్మికులతో మాట్లాడి, కొత్త పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు మరింత ఉపాధి భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. పథకం ప్రకారం వేతనదారులకు పనులు మంజూరు చేసి, చేసిన పనికి సంబంధించిన వేతనాలను నిబంధనల ప్రకారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పథకం కింద ఒక జాబ్ కార్డుకు ఏడాదికి 100 రోజుల పనిదినాలు మాత్రమే ఉండగా, వీబీజీ రామ్‌జీ పథకం అమలుతో వాటిని 125 రోజులకు పెంచారన్నారు. దీంతో గ్రామీణ కార్మికులకు అదనంగా 25 రోజుల ఉపాధి లభించనుందన్నారు. ఈ పథకం అమలులో భాగంగా ఉపాధి హామీ విభాగంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంట్స్ అసిస్టెంట్లు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లకు కొత్త హోదాలు కల్పిస్తూ ఉద్యోగ భద్రతను



ప్రభుత్వం బలోపేతం చేసిందన్నారు. డిజిటల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్, గ్రామీణ రోజ్‌గార్ సహాయక్, రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసోసియేట్, మిషన్ ఇంజినీరింగ్ అసోసియేట్, అసిస్టెంట్ మిషన్ మేనేజర్ వంటి కొత్త హోదాలు అమల్లోకి రానున్నాయని వెల్లడించారు. మస్టర్ నమోదు చేసిన 15 రోజుల్లోగా కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేయడం తప్పనిసరి కాగా, ఆలస్యం జరిగితే పరిహారం చెల్లించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. అలాగే పని కోరిన ప్రతి అర్హుడికి 15 రోజుల్లో ఉపాధి కల్పించాల్సి ఉంటుందన్నారు. జాబ్ కార్డుల స్థానంలో గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు జారీ చేయనుండగా, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఆరు నెలలకు సామాజిక తనిఖీలు నిర్వహించడం, పనులు, వేతనాలు, మస్టర్ రోల్స్, చెల్లింపుల వివరాలను బహిరంగంగా వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఫిర్యాదుల పరిష్కారానికి గ్రీవెన్స్ రెడ్రెసల్ వ్యవస్థ, అంబుడ్స్‌పర్సన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు పర్యవేక్షణ, తనిఖీలు, నష్టపరిహారం, శిక్షణ వంటి అంశాలకు ప్రత్యేక నిబంధనలు రూపొందించారన్నారు. ఇక ఈ పథకం అమలుకు అవసరమైన వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూర్చనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ఉపాధికి మరింత బలం చేకూర్చే ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) గారు తదితరులు పాల్గొన్నారు.

## సిస్కో పోలీసు స్టేషన్ ద్వారా తక్షణ స్పందన..

### శ్రీ గోపినాథ్ జట్టి, ఐపీఎస్.




**శ్రీకాకుళం జిల్లా జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నేర నియంత్రణ,అత్యవసర సంఘటనలపై సిస్కో పోలీసు స్టేషన్ ద్వారా తక్షణ స్పందన లభిస్తుందని విశాఖపట్నం రేంజ్ ఐజీ శ్రీ గోపినాథ్ జట్టి, ఐపీఎస్., పేర్కొన్నారు.శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం, పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో డా . రెడ్డీస్ ల్యాబ్రేట్రిస్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన సిస్కో పోలీసు స్టేషన్ ను గురువారం ఉదయం విశాఖపట్నం రేంజ్ ఐజీ శ్రీ గోపినాథ్ జట్టి, ఐపీఎస్ మరియు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రేంజ్ ఐజీ శ్రీ గోపినాథ్ జట్టి, ఐపీఎస్ మాట్లాడుతూ, సిస్కో పోలీసు స్టేషన్ ద్వారా పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ మరింత పటిష్ఠమవుతుందని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నేర నియంత్రణ, అత్యవసర సంఘటనలపై తక్షణ స్పందన, పరిశ్రమల భద్రతకు సంబంధించిన అంశాలపై నిరంతర పర్యవేక్షణ, పోలీసు సంబంధిత శాఖలతో సమన్వయం మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుందని తెలిపారు.పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ పోలీస్ స్టేషన్ పరిశ్రమలు, కార్మికులు, ప్రజలకు మరింత భద్రతాయుత వాతావరణాన్ని కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఇప్పటి వరకు పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతం రణస్థలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండగా, సిస్కో పోలీసు స్టేషన్ ఏర్పాటు ద్వారా పోలీసు సేవలు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందుబాటులోకి రానున్నాయని ఐజీ తెలిపారు. సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో అవసరమైన పోలీసు సిబ్బందిని నియమిస్తున్నట్లు, ఆయా సిబ్బంది నిరంతరం విధుల్లో అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో ఈ విధమైన పోలీసు స్టేషన్ ఏర్పాటు అవసరం ఉందని అని ఆయన స్పష్టం చేశారు. సిస్కో పోలీసు స్టేషన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టిన జిల్లా ఎస్పీని అభినందించి, సహకరించిన పారిశ్రామిక సంస్థల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ మాట్లాడుతూ, రణస్థలం పైడిభీమవరం మధ్య దూర ప్రాంతం ఎక్కువ కావడంతో పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల వేగవంతమైన స్పందనతో పాటు పరిశ్రమలు--పోలీసుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ సిస్కో పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఈ పోలీస్ స్టేషన్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోఅదనపు ఎస్పీలు కెవి రమణ పి శ్రీనివాసరావు,డీఎస్పీ వివేకానంద, డా రెడ్డీస్ ల్యాబ్రేట్రిస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డా వి నారాయణ రెడ్డి,సీఐ ఎం. అవతారం, ఎస్సై చిరంజీవితో పాటు పోలీసు అధికారులు, వివిధ పారిశ్రామిక సంస్థల యాజమాన్యం,సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## దేశాయపేట మున్సిపల్ పాఠశాల సమస్యపై ఎంఈఓకు తల్లిదండ్రుల వినతి.



**మచిలీపట్నం ప్రతినిది జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం దేశాయపేట మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)ను కలిసి పాఠశాలలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రాథమిక పాఠశాల (1 నుంచి 5వ తరగతి) విద్యార్థులకు మొదటి అంతస్తులో తరగతులు నిర్వహిస్తున్నందున, విరామ సమయంలో పిల్లలు మెట్లపై తోపులాటకు గురై గాయపడుతున్నారని తల్లిదండ్రులు ఎంఈఓ దృష్టికి తీసుకువచ్చారు. చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ గ్రౌండ్ ఫ్లోర్‌లోనే తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమస్యపై స్పందించిన మచిలీపట్నం మండలం సౌత్ ఎంఈఓ శ్రీనివాస్, దేశాయపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంఈఓ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి ముందుకు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## సూదిరెడ్డి వారి నూతన వస్త్ర బహుకరణ వేడుకల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు, జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జి.కొండూరు మండలం గడ్డమణుగు గ్రామంలో సూదిరెడ్డి కుటుంబం గురువారం నిర్వహించిన నూతన వస్త్ర బహుకరణ వేడుకల్లో మైలవరం శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు గారు పాల్గొన్నారు. చిన్నారులు జిగీష, సిరిలను ఆశీర్వదించారు. వారి భవిష్యత్తు విద్య, ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సూదిరెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**విజయనగరం జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వైకాపా పాలనలో రైతులు భూ సమస్యలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు ఆరోపించారు. గురువారం విజయనగరం మండలం మలిచర్లలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భం ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను తొలగించడానికి సకాలంలో పాస్ పుస్తకాలు అందిస్తోందని చెప్పారు. భూ సమస్యలను పరిష్కరించే బాధ్యత తీసుకుంటున్నామని.. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**చింతలపూడి జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఏలూరు జిల్లా చింతలపూడి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ 25 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 14,13,618 విలువైన చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఆసరాగా నిలుస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రావణ్‌ను మాకు అప్పగించండి

### : జనసేన నేతలు



**సర్పవరం జూలై 2 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కాకినాడ జిల్లా సర్పవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. యూట్యూబర్ ప్రశ్న రావణ్‌ను వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌కు తరలిస్తుండగా జనసేన నేతలు అడ్డుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించి.. ప్రొటోకాల్ వాహనాలను అడ్డగించారు. రావణ్‌ను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. రావణ్‌ను తరలిస్తున్న వాహనంపై కోడి గుడ్లతో దాడి చేశారు. విద్యార్థుల గొడవను కులాల మధ్య గొడవగా చిత్రీకరించడంతోపాటు ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో పోలీసులు రావణ్‌ను అరెస్టు చేశారు. బుధవారం పిఠాపురం పోలీస్‌స్టేషన్‌లో విచారించిన పోలీసులు.. ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు ఎందుకు చేశారని ప్రశ్నించారు. రాత్రి పిఠాపురం జూనియర్ సివిల్ జడ్జి బెయిల్ మంజూరు చేయగా… ఇవాళ ఉదయం సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో మరోసారి విచారణ జరిగింది.

# నేడు థియేటర్లలోకి నాగబంధం మూవీ




పౌరాణిక అంశాలు, ఫాంటసీ అడ్వెంచర్, థ్రిల్లింగ్ కథాంశంతో తెరకెక్కిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' సినిమా జులై 3న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. విడుదలకు ముందే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ఇప్పుడు మేకర్స్ మరో ప్రత్యేక నిర్ణయంతో అందరి దృష్టిని ఆకర్షించారు. సినిమా విడుదల రోజునే ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్ర బృందం 'బై వన్ గెట్ వన్' ఆఫర్‌ను ప్రకటించింది. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందించే ఈ స్కీమ్‌ను తొలి రోజు నుంచే అమలు చేస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి ప్రమోషనల్ ఆఫర్లు ఎక్కువగా కనిపిస్తుండగా, ఇప్పుడు తెలుగు సినిమాల్లో కూడా ఈ తరహా మార్కెటింగ్ వ్యూహాలు చోటుచేసుకోవడం ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు లేదా ఇతర భాషల వెర్షన్లకు ఈ సదుపాయం ఉండదు. 'నాగబంధం'ను అత్యంత భారీ నిర్మాణ విలువలతో రూపొందించారు. పౌరాణిక కథాంశానికి ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దినట్లు మేకర్స్ చెబుతున్నారు. ఫాంటసీ ప్రపంచం, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండనున్నాయని ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అడ్వెంచర్ అంశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటులు జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నగర్కర్, రిషభ్ సాహ్నీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథలో ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా దర్శకుడు అభిషేక్ నామా రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. నాగబంధం' సినిమా కాదు... ఓ అనుభవం అన్నారు విరాట్‌కర్ణ. ఆయన కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'నాగబంధం'. ఓ నటుడిగా అందరి హృదయాల్లో స్థానం సంపాదించాలని ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశా. ఇంత పెద్ద సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటా. ఇందులో ప్రతిదీ ఓ అద్భుతంలా ఉంటుంది. మన భారతీయ సంస్కృతి, వారసత్వానికి జరిగే ఓ వేడుకలాంటి సినిమా ఇది అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ అందరూ ప్రాణం పెట్టి చేసిన ఖరీదైన సినిమా ఇది. పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మన సంస్కృతి, మన మూలాల్ని ఆవిష్కరిస్తూ, సనాతన ధర్మం గురించి గొప్ప సందేశమిస్తుందీ చిత్రం. ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభవాన్ని పంచేలా భారీ హంగులతో తెరకెక్కించాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రతి పది నిమిషాలకు ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే చిత్రమిది. విజువల్ వండర్‌గా అందరి హృదయాల్ని గెలుస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.




# జైలర్-2 షూటింగ్ పూర్తి

## ప్రత్యేక పాత్రలో హృతిక్ రోషన్



మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. తాజాగా 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు టీమ్ తెలిపింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. నిజానికి ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే పూర్తయింది. కానీ, నెల్సన్ ఈ కథలో మరికొన్ని కొత్త సన్నివేశాలు యాడ్ చేసి 25 రోజుల పాటు మళ్లీ షూటింగ్ నిర్వహించారు. తాజాగా అవి కూడా పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో హృతిక్ రోషన్ అతిథి పాత్రలో నటిస్తున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఆయన చెన్నై రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ 25 రోజుల షెడ్యూల్‌లో ఆయనకు సంబంధించిన సన్నివేశాలనే చిత్రీకరించారని సమాచారం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జైలర్'లో పలు భాషలకు చెందిన అగ్రతారలు అతిథి పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. రెండో భాగంలోనూ ఆ సందడి కొనసాగనుంది. సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి కూడా ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగం ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే సీక్వెల్ ప్రారంభమవుతుందని గతంలో శివరాజ్ కుమార్ తెలిపారు.

# దసరాకు విడుదల కానున్న విశ్వంభర

## సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో-ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.





## ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల జోష్.. సెన్సెక్స్ +579, నిఫ్టీ ం169



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. అంతర్జాతీయ పరిస్థితులు సానుకూలంగా మారడం, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం మదుపర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. అదేవిధంగా ఐటీ షేర్ల కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 579 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 169 పాయింట్లు పైకి ఎగబాకింది. సెన్సెక్స్ ఉదయం 77,083.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,922.64) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. 77,578.93 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 579.48 పాయింట్ల లాభంతో 77,502.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 169.85 పాయింట్ల లాభంతో 24,175.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌సీఎల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎల్‌అండ్‌టీ, మారుతీ, యాక్సిస్‌బ్యాంక్, రిలయన్స్, బీఈఎల్, కోటక్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95.40గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.54 డాలర్ల వద్ద ఉండగా, బంగారం ఔన్సు ధర 4,063 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## ఒప్పో నుంచి రెనో 16 సిరీస్ స్మార్ట్‌ఫోన్లు.. తొలిసారి బబుల్ యాక్సెసరీతో



ఒప్పో తన రెనో సిరీస్‌లో కొత్త ఫోన్లను దేశీయ మార్కెట్‌లో లాంచ్ చేసింది. గతంలో తీసుకొచ్చిన రెనో 14, 15 సిరీస్‌కు కొనసాగింపుగా రెనో 16 సిరీస్‌ను తీసుకొచ్చింది. ఈ సిరీస్‌లో ఒప్పో రెనో 16, ఒప్పో రెనో 16సీ పేరిట ఫోన్లను లాంచ్ చేసింది. వీటితో పాటు ఒప్పో బబుల్ యాక్సెసరీని తీసుకొచ్చింది. ఈ రెండు స్మార్ట్‌ఫోన్లు ఆండ్రాయిడ్ 16తో పనిచేస్తాయి.

ఒప్పో రెనో 16

ఈ ఫోన్‌కు 6.32 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ ంఆమోలెడ్ డిస్‌ప్లే, 120ఎఓ రిఫ్రెష్ రేటు, 3,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఇచ్చారు. క్వాల్‌కామ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 7 జెన్4 ప్రాసెసర్‌తో ఉంది. ఫింగర్ ప్రింట్ సెన్సార్, ఫేస్ అన్‌లాక్ ఆప్షన్‌తో పాటు ఇందులో ట్రిపుల్ కెమెరా అమర్చారు. వెనక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరాం 50 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరాం 50 ఎంపీ టెలిఫొటో కెమెరా ఇచ్చారు. ముందు వైపు 50 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. IP66 + IP68 + IP69 + IP69K రేంటింగ్ ఉంది. ఆండ్రాయిడ్ 16 ఆధారిత కలర్‌ఓఎస్16 మీద పనిచేస్తుంది. 6,700పొహ్ష్త బ్యాటరీ, 80ఔ వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. వైఫై, బ్లూటూత్ 5.4, యూఎస్‌బీ టైప్ సీ వంటి కనెక్టివిటీ సదుపాయాలు ఉన్నాయి. ఫోన్ బరువు 193గ్రాములు. బేస్ వేరియంట్ 8+దీం 256+దీ ధర రూ. 61,999, టాప్ వేరియంట్ 12+దీ ం 256+దీ ధర రూ.67,999గా కంపెనీ నిర్ణయించింది.

ఒప్పో రెనో 16 సీ

6.57 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీం అమోలెడ్ డిస్‌ప్లే, 120ఎఓ రిఫ్రెష్ రేటు, 1,400 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఇచ్చారు. ఆక్టా కోర్ మీడియా టెక్ డైమెన్‌సిటీ 7300 ప్రాసెసర్ అమర్చారు. ఫింగర్ ప్రింట్ సెన్సార్, ఫేస్ అన్‌లాక్ ఆప్షన్ ఉంది. ఆండ్రాయిడ్ 16 ఆధారిత కలర్‌ఓఎస్16 మీద పనిచేస్తుంది.

## 9,500 కోట్ల ఐపీఓకు కోకాకోలా ఇండియన్ యూనిట్



ప్రముఖ శీతలపానీయాల సంస్థ కోకాకోలా.. భారత్‌కు చెందిన తన బాటిలింగ్ యూనిట్ హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను పబ్లిక్ ఇష్యూకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. మార్కెట్ నుంచి 1 బిలియన్ డాలర్లు, అంటే మన కరెన్సీలో దాదాపు రూ.9,500 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందుకోసం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. వచ్చే వారం లండన్ వేదికగా ప్రజంటేషన్ ఉండొచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కోకాకోలాకు ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా ఉన్న రోత్స్‌చైల్డ్ అండ్ కో సంస్థ ప్రతిపాదిత ఐపీఓపై బ్యాంకర్లతో సమావేశం కానుంది. ఐపీఓ సైజ్, ఇతర వివరాలపై త్వరలో స్పష్టత రానుంది. దీనిపై కోకాకోలా అధికారికంగా స్పందించలేదు. ఇటీవల కాలంలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ భారత అనుబంధ సంస్థలను ఐపీఓకు తీసుకొస్తున్నాయి. ఎల్‌జీ, హ్యుందాయ్ ఇప్పటికే పబ్లిక్ ఇష్యూకు రాగా.. కోకాకోలా కూడా ఈ జాబితాలో చేరనుంది. కోకాకోలాకు భారత్ అతిపెద్ద మార్కెట్. ప్రస్తుతం హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ లిమిటెడ్ విలువ 10 బిలియన్ డాలర్లుగా ఉంది. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థకు 12 రాష్ట్రాల్లో 14 తయారీ ప్లాంట్లు ఉన్నాయి. దాదాపు 5,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 17 లక్షల రిటైల్ ఔట్‌లెట్లు ఉన్నాయి.

## యూజర్‌నేమ్ ఫీచర్.. అనుమానాలకు స్పష్టతనిచ్చిన వాట్సప్



మెటా మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ ప్రకటించిన యూజర్‌నేమ్ ఫీచర్‌పై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కేంద్రం కూడా నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఈ ఫీచర్‌పై వస్తోన్న అనుమానాలకు వాట్సప్ వివరణ ఇచ్చింది. ఆ ఫీచర్‌ను ఇటీవలే ప్రకటించామని, విస్తృతస్థాయిలో అది అందరికీ అందుబాటులోకి రాలేదని మరోసారి వెల్లడించింది. ఈ ఏడాది చివరి నాటికి దశలవారీగా ఇది అందరికీ అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా యూజర్ల నుంచి వస్తోన్న ప్రశ్నలకు సమాధానాలిచ్చింది.

ప్రశ్న: యూజర్‌నేమ్ తప్పనిసరా..?

సమాధానం: కాదు.. ఆప్షనలే. మీకు కావాలనుకుంటేనే మీరు పేరును రిజర్వ్ చేసుకోవచ్చు. లేదంటే నంబరుతోనే కొనసాగించొచ్చు.

ప్రశ్న: నాకు కావాల్సిన యూజర్‌నేమ్ అందుబాటులో లేకపోతే..?

సమాధానం: కోరుకున్న యూజర్‌నేమ్ అందుబాటులో లేకపోవడానికి కొన్ని కారణాలున్నాయి. ఆ పేరుమీద ఇప్పటికే ఇన్‌స్టా, ఫేస్‌బుక్ యూజర్లు ఉంటే.. వారికే దాన్ని కేటాయిస్తాం. అలాగే సెలబ్రిటీలు, ప్రభుత్వ సంస్థలు, మెటా ధ్రువీకరించిన ఖాతాదారుల పేర్లు కొన్నింటిని ఇప్పటికే రిజర్వ్ చేశాం. వాటిని చట్టబద్ధమైన యజమానులు మాత్రమే క్లెయిమ్ చేసుకోవడానికి వీలుంది. ఆ పేర్లను మీరు ఉపయోగించడానికి ప్రయత్నిస్తే.. అందుబాటులో లేదనే సమాధానం వస్తుంది. కొత్త పేరుకోసం యూజర్‌నేమ్ జనరేటర్ ఆప్షన్‌ను వాడుకునే వీలు కల్పిస్తున్నాం.

ప్రశ్న: నా పేరిట ఇతరులను మోసం చేయడానికి నా యూజర్‌నేమ్ లాంటిదే క్రియేట్ చేసి మెసేజ్‌లు చేస్తే.. మోసపూరిత వ్యక్తులను ఎలా ఆపాలి?

సమాధానం: మెసేజింగ్ కోసం యూజర్‌నేమ్‌లు ఇంకా అందుబాటులోకి రాలేదు. అవి అందుబాటులోకి వచ్చిన తర్వాత కొత్త వారి నుంచి సందేశం వస్తే.. ఏ దేశం నుంచి అది వచ్చిందో వెల్లడిస్తాం. మొదటిసారి వచ్చినప్పుడు ఒక హెచ్చరిక చేస్తాం. బ్లాక్, రిపోర్ట్ వంటి ఆప్షన్లనూ కొనసాగిస్తాం.

ప్రశ్న: నా యూజర్‌నేమ్‌ను ఎవరైనా గెస్ చేసి, అపరిచితులు మెసేజ్ చేయడానికి వీలు ఉందా..?

సమాధానం: వాట్సప్‌లో కొత్తవారి నంబర్ కోసం వెతకడానికి అవకాశం లేనట్లే.. యూజర్‌నేమ్‌ను సెర్చ్ చేయడానికీ వీలుండదు. అయినప్పటికీ మీరు మరింత భద్రత కోసం యూజర్‌నేమ్ కీ ఆప్షన్, వాట్సప్‌కే ప్రత్యేకమైన యూజర్‌నేమ్‌ను ఎంచుకోవడం వంటి మార్గాలున్నాయి.

ప్రశ్న: యూజర్‌నేమ్ కీ అంటే..?

సమాధానం: యూజర్‌నేమ్‌తో పాటు అదనపు భద్రత కోసం ఈ కీని ఉపయోగించుకోవచ్చు. ఇది ఎనేబుల్ అయి ఉంటే.. కొత్త వ్యక్తులు మిమ్మల్ని సంప్రదించడానికి యూజర్‌నేమ్‌తో పాటు ఈ కీ కూడా తెలిసి ఉండాలి. ఈ కీని రీసెట్ చేసుకునే వీలు ఉంటుంది.

ప్రశ్న: మెటాలో ఉన్న ఇతర ఖాతాలను (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్) లింక్ చేయాలా..?

సమాధానం: ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఖాతాలకు ఉన్న యూజర్‌నేమ్‌నే కోరుకుంటే.. వాటిని లింక్ చేయాల్సి ఉంటుంది. ఆ ఖాతాకు చట్టబద్ధమైన యజమాని అని నిర్ధరించుకునేందుకు ఇది ఒక మార్గం. కావాలనుకున్నప్పుడు అన్‌లింగ్ చేయొచ్చు. వాట్సప్‌నకు ప్రత్యేకమైన యూజర్‌నేమ్‌ను ఎంచుకోవచ్చు.

వాట్సప్ కొత్తగా తీసుకొచ్చిన ఈ యూజర్‌నేమ్ ఫీచర్‌తో.. నకిలీ గుర్తింపు ధ్రువీకరణలు పెరిగి, మోసాలు అధికమవుతాయనే ఆందోళనలు నెలకొన్నాయి. ప్రముఖ సంస్థలు, వ్యక్తులను పోలిన పేర్లతో యూజర్ నేమ్ తీసుకుని, అమాయకులకు మెసేజ్‌లు పంపి మోసగించే వీలుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం నోటీసులు జారీ చేసింది. సైబర్‌నేరాలు పెరిగే ప్రమాదం ఉన్నందున, ఐటీ చట్టం ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని మెటాను కేంద్రం ఆదేశించింది. మూడు రోజుల్లో సవివర నివేదిక అందించాలని, దీనిపై సమగ్ర పరిశీలన జరిపి, తాము సంతృప్తి చెందేవరకు భారత్‌లో అమలు చేయొద్దని ఆదేశించినట్లు కథనాలు వెలువడ్డాయి.

# వాయులింగేశ్వరుని సన్నిధిలో నారా లోకేష్



**శ్రీకాళహస్తి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ విద్య మరియు సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించి, శ్రీకాళహస్తీశ్వర స్వామి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని ప్రత్యేక అంతరాలయంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆలయ ఈవో బి కే వెంకటేశులు, ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ దక్షిణ గోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక స్వామి అమ్మ వార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్రపటం తీర్థ ప్రసాదాలు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నారా లోకేష్ కు అందజేశారు .




## దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు



**శ్రీకాళహస్తి, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీ దక్షిణామూర్తికి విశేష పూజలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం స్వామివారి సన్నిధి వద్ద కలశాన్ని ఏర్పాటుచేసి సంకల్ప పూజలు నిర్వహించారు. గోక్షీరం తో పాటు విశేష పూజ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. విశేష అలంకరణలు పూర్తయ్యాక ధూప దీప నివేదనలు సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ద్వితీయ ద్వాదశ వార్షిక మహా కుంభాభిషేకం




**శ్రీకాళహస్తి రూరల్, జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి పట్టణంలోని బజారు వీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ద్వితీయ ద్వాదశ వార్షిక మహా కుంభాభిషేక మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖరంపై మహా కుంభాభిషేకం నిర్వహించి, మూలవిరాట్ శ్రీ వాసవి కన్యకాపర మేశ్వరి అమ్మవారికి మహా కుంభాభిషేక అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు జూలగంటి మురళీ మోహన్ గుప్త ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు సమన్వయంతో నిర్వహించారు.

# డేటా ఆధారిత నిర్ణయాలదే ఇక భవిష్యత్తు

## -సంపద సృష్టికి ప్రైవేట్ రంగం నుంచి పెట్టుబడులు సాధించడం కూడా ముఖ్యం

## -ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ లో సీఎం




**తిరుపతి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి లో ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్‌పై నిర్వహిస్తోన్న రెండు రోజుల వర్క్ షాప్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగించారు,పేదల స్థితిగతులు మార్చేందుకు ప్రభుత్వ పథకాలు సమర్ధవంతంగా అమలు చేసే అంశాన్ని వర్క్ షాప్‌లో ఆయన ప్రస్తావించారు.తాను స్వయంగా వెళ్లి పెన్షన్ పంపిణీ చేసిన తులశమ్మ, పద్మమ్మల జీవన స్థితిగుతులను సమావేశంలో వివరించారు.ప్రభుత్వ పథకాలు, డ్వాక్రా రుణాల ద్వారా సదరు కుటుంబానికి జరిగిన మేలు ను ఆయన వివరించారు.పేదల స్థితిగతులను మెరుగు పరిచేందుకు జీఎస్డీపీ, సీఏజీఆర్ గణాంకాలను బేరీజు వేసుకుని పాలన చేస్తున్నామన్నారు.తానూ ఆర్థికశాస్త్రం చదివానని.. దానికంటే సమాజం నుంచి.. ప్రజల నుంచి ఎక్కువగా నేర్చుకున్నానని చెప్పారు.ఈ వర్క్ షాప్‌కు ఆర్థిక, పరిపాలన వ్యవహారాల్లో ప్రముఖ స్థానంలో ఉన్న నిపుణులు హాజరుకావడం సంతోషం వ్యక్తం చేశారు.దేశంలోనే తొలిసారి 2020 విజన్ రూపొందిస్తే తనను విమర్శించారని.దేశానికి కూడా విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం భావించారన్నారు.ఐటీతో ప్రపంచం కుగ్రామంగా మారిందని ఐటీతో అభివృద్ధి సాధించగలమని తాను బలంగా నమ్మినట్లు పేర్కొన్నారు. సర్వీస్ సెక్టార్ రివ ల్యూషన్ ను అందిపుచ్చుకుంటే అభివృద్ధి జరుగుతుందని విశ్వసించి తదనుగుణంగా పనిచేశామన్నారు. డేటానే సంపదగా మారిన రోజుల్లోకి వచ్చామని.. డేటా ఆధారిత నిర్ణయాలకే భవిష్యత్ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ప్రజలకు ప్రభుత్వం సేవలు అందించడం ఎంత ముఖ్యమో..సంపద సృష్టికి ప్రైవేట్ రంగం నుంచి పెట్టుబడులు సాధించడం కూడా అంతే ముఖ్యం అని సీఎం అన్నారు..స్వర్ణాంధ్ర విజన్ లో ప్రైవేట్ పెట్టుబడులు అనే అంశాన్ని చేర్చినట్లు చెప్పారు.అన్ని రంగాలకు సంబంధించిన డేటాను సేకరించడమే కాకుండా.. డేటా అనుసంధానం కూడా ముఖ్యమని.డేటా లేక్ ద్వారా అన్ని శాఖల సమాచారం అనుసంధానం చేస్తున్నామన్నారు. హెల్త్ రికార్డులను డిజిటలైజ్ ద్వారా సంజీవని ప్రాజెక్టు అమలుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.పేద-ధనికుల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేశామని. సమాజం నుంచి లబ్ది పొంది ఎదిగిన వారు సమాజానికి కొంతైనా ఇవ్వాలనే ఆలోచన నుంచే పీ4 కార్యక్రమం ఆవిర్భవించిందని,ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడాలనేది తన లక్ష్యమని, రాష్ట్రంలో ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించాలన్నది తన ఆలోచనగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.సంతృప్తి చెందితే.. స్టేటస్ కో ఇచ్చినట్టే... అందుకే నేను త్వరగా సంతృప్తి చెందనని ప్రజల కోసం నిరంతరం పని చేసేందుకు సంతృప్తి పడి సరిపెట్టకుండా కొత్త విధానాలను అన్వేషిస్తూనే ఉండాలన్నారు.టెక్నాలజీని వినియోగించుకోవాలి.. అలాగే ఈ రంగంలో సొంతంగా వ్యవస్థలను కూడా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ఐక్యంగా పని చేస్తే అభివృద్ధి సాధించగలమని.దేశం నాకేమిచ్చిందనే దానికంటే దేశానికి మనమేం చేశామనే రీతిలో ఆలోచించాలన్నారు. త్వరలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటర్ అందుబాటులోకి వస్తుందని.క్వాంటం కంప్యూటర్లను తయారు చేసే సామర్థ్యాన్ని కూడా ఏపీ సాధించబోతోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్టాటస్టిక్స్-ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ కె.వి. రాజు, ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రచార పోస్టర్ల విడుదల

**తిరుపతి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సఖీ హబ్ సహకారం తో మహిళల ఆరోగ్యం మరియు పరిశుభ్రత అవగాహన లక్ష్యంగా ముద్రించిన పోస్టర్లను తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ గురువారం విడుదల చేశారు. మహిళల కోసం ఇలాంటి ప్రత్యేక మైన కార్యక్రమాలను అన్ని మండలాల్లో చేయడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమం లో సఖీ హబ్ తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ టి.పార్వతి, మునిసిపల్ కార్పొరేషన్ శానిటరీ సూపర్వైజర్ చెంచయ్య, మరియు హెల్పింగ్ హాండ్స్ సొసైటీ కార్యదర్శి దొరస్వామి, మండల కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

## స్విమ్స్ టిటిడి ప్రాణదాన పథకం క్రింద 261 మంది పేదరోగుల ఎంపిక

**తిరుపతి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) లో గురువారం డైరెక్టర్ కార్యాలయం కమిటి హాల్ లో టిటిడి ప్రాణదాన కమిటి సమావేశం జరిగింది. స్విమ్స్ సంచాలకులు/ఉపకులపతి డా॥ ఆర్.వి.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయలయ డైరెక్టర్ డా॥ శ్రీనాథ్ రెడ్డి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా॥ రామ్, ఆర్.ఎం.ఓ. డా॥కె.వి కోటిరెడ్డి, బర్డ్ హాస్పిటల్ ఆర్.ఎం.ఓ. డా॥ రామూర్తి, టిటిడి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ కుసుమకుమారి, రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా॥ సుబ్బలక్ష్మి, మెటర్నటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా॥ శ్రీనివాసులు, మరియు స్విమ్స్‌కు చెందిన సంబంధిత విభాగాధిపతులు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.రోగుల ఆర్థిక స్థితిగతులు,జబ్బు తీవ్రత లను పరిగణన లోకి తీసుకుని బియ్యం కార్డు కలిగి,దారిద్రరేఖకు దిగువన జీవిస్తున్న 261 మంది పేద రోగులను ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు.కార్డియాలజీ విభాగం చికిత్సలకు 8 మంది,కార్డియోథొరాసిక్ శస్త్ర చికిత్సలకు 25 మంది,జనరల్ సర్జరీలకు 14 మంది,మెడిసిన్ విభాగంలో 16 మంది,నెఫ్రాలజీ విభాగంలో అత్యధికంగా 76 మంది,న్యూరాలజీ చికిత్సలకు 9 మంది,న్యూరో సర్జరీలకు 45 మంది,గైనకాలజీ చికిత్సలకు 4గురు,రేడియాలజీ విభాగంలో ఒక్కరు,రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో 4 గురు,గ్యాస్ట్రో ఎంటరాలజీ చికిత్సలకు 48 మంది,సర్జికల్ ఆంకాలజీ విభాగంలో 10 మంది,యురాలజీ విభాగంలో ఒక్కరిని, మొత్తం 261 మందిని ఉచిత చికిత్సలకు ఎంపిక చేశారు.తమలాంటి పేద రోగులకు ప్రాణదానం క్రింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడానికి ఆర్థిక సహాయం చేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యానికి ఈ సందర్భంగా ఉచిత చికిత్సలకు ఎంపికైన వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి చేయూతనిచ్చే టి.టి.డి. ప్రాణదాన పథకానికి దాతలు, సంస్థలు సహృదయంతో ముందుకు వచ్చి విరివిగా విరాళాలు అందించాలన్నారు.

## శ్రీవారిసేవలో గ్రూప్ సూపర్వైజర్ల పాత్ర అత్యంత కీలకమైనది

### - టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి



**తిరుమల,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీటీడీ నిర్వహిస్తున్న శ్రీవారిసేవలో గ్రూప్ సూపర్వైజర్ల పాత్ర అత్యంత కీలకమైనదని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలోని సేవా సదన్-2 లో గురువారం ఉదయం ప్రారంభమైన శ్రీవారిసేవ గ్రూప్ సూపర్వైజర్ల రెండో విడత శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్ నారా చంద్రబాబు నాయుడు హాయంలో2000వ సంవత్సరంలో మొదటిసారిగా టీటీడీ శ్రీవారిసేవ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం శ్రీవారిసేవకులకు వారి ప్రాంతాల్లోనే శిక్షణ ఇచ్చేందుకు గ్రూప్ సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే తొలి బ్యాచ్ లో 1400 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రెండో విడుతలో 2600 మందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఐఐఎం-అహ్మదాబాద్ వారి సహకారంతో అత్యంత ఉపయోగకరమైన శిక్షణ మెటిరియల్ రూపొందించడం జరిగిందన్నారు. ఇందులో ఆధ్యాత్మికతతో పాటు నిర్వహణ నైపుణ్యాలను నేర్చుకునేలా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఈ మెటిరియల్ ను పూర్తిగా అర్థం చేసుకుని శ్రీవారి సేవకులను సమర్థవంతంగా నడిపించాలని చెప్పారు. శ్రీవారి సేవకులు తమ పాత్రను అర్థం చేసుకుని బాధ్యత, సహనంతో భక్తులకు సేవలందించాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా టీటీడీ వ్యవస్థపై పూర్తి అవగాహన తెచ్చుకుని భక్తులకు సమాచారం అందించడంలో కీలక పాత్ర వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీవారిసేవా విభాగాధిపతి డాక్టర్ టి.రవి, శ్రీవారిసేవ శిక్షకులు డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి శ్రీనివాస్, డాక్టర్ శరత్ కుమార్, పొలమడ రమేష్ బాబు, శ్రీవారిసేవ సిబ్బంది పాల్గొన్నారు.

## రీసర్వే పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి

### -ఎల్.బి.ఎస్.ఎన్.ఏ.ఏ. ఫ్యాకల్టీ మెంబెర్ స్నేహసిస్ మెహ్రా

**తిరుపతి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**నక్ష లో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న రీసర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ పరిపాలనా అకాడమీ (ఎల్.బి.ఎస్.ఎన్.ఏ.ఏ) అధ్యాపక సభ్యులు స్నేహాసిస్ మిశ్రా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, రీసర్వే సిబ్బందికి సూచించారు.నక్షా' కార్యక్రమం కింద నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా గురువారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో నక్ష రీసర్వే కార్యక్రమాలు, శిక్షణా విధానాలు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి నేతృత్వంలో జరుగుతున్న నక్ష కార్యక్రమాలను స్నేహసిన్ మెహ్రా కు అధికారులు వివరించారు.డిజిటల్ సర్వే కార్యకలాపాలు మెరుగు పరుచుకోవాలని ఆమె వారికి సూచించారు.ఆస్తులకు సంబంధించిన సర్వే మరింత పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బందికి అందించిన శిక్షణ తో మెరుగైన్నా ఫలితాలను సాధించాలన్నారు. మెరుగైన సేవలందించేందుకు అవసరమైన శిక్షణను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిసిపీ దేవి కుమారి, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువారెడ్డి, మేనేజర్ హాసీమ్, స్వర్ణ వార్డు కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఘన స్వాగతం



**తిరుపతి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం నేటి గురువారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, జిల్లా బి జె పి అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, బిజెపి నాయకులు కోలా ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ రావు, రాస్ చైర్మన్ డా.వెంకటరత్నం, రాస్ కృషీ విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ శ్రీలత, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తదితరులు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి గారికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.అనంతరం రైల్వే కోడూరు నియోజకవర్గ, ఓబులవారిపల్లె, ముక్కావారి పల్లె లో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ఘన స్వాగతం



**తిరుపతి,జూలై 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం గురువారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం లభించింది.తిరుపతి, రైల్వే కోడూరు ఎమ్మెల్యే లు ఆరని శ్రీనివాసులు, అరవ శ్రీధర్, హ్యాండ్ క్రాఫ్ట్ ఛైర్మెన్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి టెంపుల్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, అడిషనల్ ఎస్పీ శ్రీలత, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి,జనసేన నాయకులు రాజారెడ్డి తదితరులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.అనంతరం రైల్వే కోడూరు నియోజకవర్గ, ఓబులవారిపల్లె, ముక్కావారి పల్లెలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బయలుదేరీ వెళ్లారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027